## కవిత జ్యుడిషియల్ కస్టడీ 14 వరకు పొడిగింపు

న్యూఢిల్లీ : ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌస్? అవెన్యూ కోర్టు పొడిగించింది. ఈ నెల 14 వరకు కస్టడీ పొడిగిస్తున్నట్లు మంగళవారం వెల్లడించింది. లిక్కర్ కేసులో కవితను మార్చి15న ఈడీ అరెస్ట్ చేసింది.. అప్పటి నుంచి ఆమె తీహార్ జైలులో ఉంటున్నారు.. ఆమె బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్ కోర్టు కొట్టివేసింది.. ఈ నేపథ్యంలోనే కస్టడీ ముగియడంతో మంగళవారం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. దీంతో కోర్టు కవిత కస్టడీని మరో ఏడు రోజులు పొడిగించింది. మరోవైపు కేజ్రీవాల్? జ్యుడీషియల్ కస్టడీని కూడా రౌస్? అవెన్యూ కోర్టు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించింది.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :71 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 08-05-2024 | పేజీలు:4 వెల: 2.00


## మా ప్రభుత్వాన్నికూల్చడం అసాధ్యం



హైదరాబాద్,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చడం ఎవరి తరమూ కాదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల మద్దతు అధికారంలోకి వచ్చామని.. అయిదేళ్లు పాలిస్తామని అన్నారు. ప్రజల తమపై నమ్మకంతో అధికారం ఇచ్చారని.. సంపద సృష్టించి వాళ్లు అందిస్తామన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. , దేశంలో రిజర్వేషన్ల రద్దు బీజేజీ అంజెడాగా మారిందన్నారు. రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ బీజేపీకి వత్తాసు పలకడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే భవిష్యత్ ఉండదని, దేశంలోని బలహీన వర్గాలు, దళిత, గిరిజనులు తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని భట్టి హెచ్చరించారు. ఇప్పటికే తెలంగాణలో కుల గణన ప్రక్రియ ప్రారంభమైందని, కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా కులగణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లు గెలుస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క జోస్యం చెప్పారు.

### డిమాండ్‌కు తగ్గట్టు పవర్ సప్లయ్ చేస్తున్నాం..

రాష్ట్రంలో పవర్ సప్లైపై ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ.. అన్ని కేటగిరీల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడం వల్ల విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్నదన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది మే నెలలో ఆరవ తారీఖు వరకు నమోదైన సరాసరి డిమాండ్, వినియోగాన్ని గతేడాదితో పోల్చుకుంటే మే నెల ఒకటి నుండి ఆరోవ తేదీ వరకు 52.9 శాతం పెరుగుదల నమోదయిందన్నారు. మే 2023లో 7062 మెగావాట్లుగా ఉన్న సరాసరి డిమాండ్ 10799 మెగావాట్లకు పెరిగింది. అలాగే సరాసరి వినియోగం సైతం 157.9 మిలియన్ యూనిట్ల నుండి 226.62 మిలియన్ యూనిట్లకు పెరిగి, 43.5 శాతం పెరుగుదల నమోదు చేసిందన్నారు.

### గ్రేటర్‌లో విపరీతంగా విద్యుత్ వాడకం..

గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ ఏడాది మే నెల ఆరు వరకు నమోదయిన సరాసరి డిమాండ్, వినియోగాన్ని గతేడాదితో పోల్చుకుంటే మే నెల ఒకటి నుండి ఆరోవ తేదీ వరకు 47.6 % పెరుగుదల నమోదయ్యింది. గతంలో ఎన్నడూ లేనంతగా డిమాండ్ వినియోగం పెరుగుతున్నా తమ సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా వుంటూ ఎక్కడ కూడా నిమిషం పాటు అంతరాయం లేకుండా అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ విధిగా కృషి చేస్తున్న సిబ్బందిని అధికారులను అభినందించాల్సిన ప్రతిపక్షాలు లేని కరెంటు కోతలను ఉన్నట్టు ప్రచారం చేస్తూ గోబెల్స్‌కు తాతలుగా వ్యవహరిస్తున్నారని భట్టి మండిపడ్డారు.

## వాళ్లు గాంధీలు కాదు.. జహంగీర్ లు ధర్మపురి అరవింద్

నిజామాబాద్ మే 7 : రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు గాంధీలు కాదు జహంగీర్ లని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఫెరోజ్ జహంగీర్ మనవడైన రాహుల్ కు గాంధీ పేరెక్కడి నుండి వచ్చింది.. ఆయన పేరు రాహుల్ జహంగీర్ అని ఉండా లి.. గాంధీల పేర్లు పెట్టుకొని ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇవాళ నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ%ౌ% ఎమర్జెన్సీ సమయంలో ఫెరోజ్ జహంగీర్ భార్య దివంగత పూర్వ ప్రధాని ఇందిరాగాంధీ సెక్యులర్ పదాన్ని రాజ్యాంగంలో ఎందుకు చేర్చాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రశ్నించారు.రాజ్యాంగానికి విరుద్ధంగా విద్యావ్యవస్థలో రిజర్వేషన్లను తొలగించింది కాంగ్రెస్ మాత్రమే అని నొక్కి చెప్పారు. కేవలం పదవి యావాకోసమే కాంగ్రెస్ దేశాన్ని మూడు ముక్కలు చేసిందని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోహింగ్యాలకు కూడా కాంగ్రెసోళ్లు రిజర్వేషన్లు, పౌరసత్వం అడగడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడి దేశ ప్రజల జీవితాలను నాశనం చేసిందని తీవ్ర నష్టం చేకూర్చిందని గుర్తు చేశారు. కేవలం మత ప్రాతిపదికన యూనివర్సిటీలకు మైనార్టీ హోదా ఇచ్చి అందులో ఎస్సీ, ఎస్టీ, ఓ బీసీలకు ఉద్యోగ విద్యా అవకాశాల్లో రిజర్వేషన్లు తొలగించారని దుయ్యబట్టారు. రానున్న భవిష్యత్తులో కూడా విద్యా వ్యవస్థలో రిజర్వేషన్లను తీసేసి రాజ్యాంగానికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందన్నారు. భారతీయ జనతా పార్టీ 370 ఆర్టికల్, త్రిపుల్ తలాక్ రద్దు చేశాము.. కానీ ఏనాడు బీజేపీ రిజర్వేషన్లను తొలగించలేదన్నారు.భవిష్యత్తులో



కాంగ్రెస్ పార్టీ అధికారంలోఉంటే హైదరాబాద్ యూనివర్సిటీతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ యూనివర్సిటీలను కూడా ముస్లిం యూనివర్సిటీలుగా మారుస్తారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ విద్యా వ్యవస్థలో రిజర్వేషన్లను తీసేసి మన పిల్లలకు విద్య లేకుండా చేసిందన్నారు. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు తొలగించి వారికివ్వడానికే కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలంగాణలో గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేస్తామని ఎందుకు చేర్చలేదని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీపై బురద జల్లుతున్నారన్నారు. యూనివర్సిటీల్లో ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు తొలగించిందే కాంగ్రెస్ అని, కాంగ్రెస్ పట్ల ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని, ఇప్పటికైనా ఈ వర్గాలు, హిందువులు కళ్ళు తెరవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దినేష్ కూలాచారి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపాస్తులపై సీబీఐ విచారణకు సిద్ధమా...

కరీంనగర్‌: వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని మోసం చేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ నేతలు నా ఆస్తిపాస్తుల పై చేస్తున్నఅవినీతి ఆరోపణలపై సీబీఐ విచారణ కోరేందుకు నేను సిద్ధంగా ఉన్నానని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సిబిఐ విచారణకు నేను సిద్ధం మరి మీ ఆస్తిపాస్తులు, అవినీతి, బినామీ ఆస్తులపై విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు.మీరు ఓకే అంటే సీబీఐకి లేఖ రాసేందుకు నేను సిద్ధమన్నారు. దమ్ముంటే నా సవాల్ ను స్వీకరించాలన్నారు. కరీంనగర్ లో గరీబోళ్ల బిడ్డకు, గడీల వారసులకు మధ్య ఎన్నికల పోరు జరుగుతోందని, ఎవరి పక్షాన నిలిచి ఓటేస్తారో ఆలోచించుకోవాలని ప్రజలను కోరారు. దేశంలో ఎన్నికలు సైతం నరేంద్రమోదీకి, రాహుల్ గాంధీకి మధ్య జరుగుతున్నాయని, ఎవరి నాయకత్వం కావాలో ఆలోచించుకోవాలన్నారు. కేసీఆర్ పెద్ద డ్రామా ఆర్టిస్టు అని, అవినీతికి కేరాఫ్ అడ్రస్ అన్నారు.తనను, తన కుటుంబాన్ని అరెస్ట్ చేయకుండా ఉండేందుకు సీబీఐని రాష్ట్రంలోకి అడుగుపెట్టకుండా ఉత్తర్వులు ఇచ్చిన కేసీఆర్ సిగ్గులేకుండా తాను సుద్దపూసనని, తనను అరెస్ట్ చేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని చెబుతున్నారని విమర్శించారు. 6 గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిలువునా మోసం చేస్తుందన్నారు. జూన్ 4 న కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదన్నారు. అవినీతి, కుంభకోణాలు, వారసత్వ పాలనతో దేశాన్ని భ్రష్టు



పట్టించిన కాంగ్రెస్ కు ఎక్స్‌పైరీ డేట్ వచ్చేసిందన్నారు.

### రేపు వేములవాడకు ప్రధాని మోడీ

రేపు ఉదయం 8 గంటలకే నరేంద్రమోదీ వేములవాడకు వస్తున్నారన్నారు. వేములాడ రాజన్నను దర్శించుకుని 9 గంటలకు వేములాడ బాలానగర్ కోర్టు వద్దనున్న మైదానంలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. ఎండలున్న నేపథ్యంలో బహిరంగ సభకు వస్తున్న వారి కోసం కూలర్లు, మజ్జిగ ప్యాకెట్లు, మంచి నీళ్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రజలు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

## చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా



అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బెయిల్‌రద్దు విచారణ మరోసారి వాయిదా పడింది. చంద్రబాబుకు బెయిల్ రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో చేసిన పిటిషన్ మంగళవారం కోర్టు ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ కేసుపై స్పందిస్తూ 10 వారాల తరువాతే విచారిస్తామని స్పష్టం చేశారు. వేసవి సెలవుల తర్వాత వెంటనే విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని ధర్మాసనం వెల్లడించింది. ఈ కేసులో చంద్రబాబును 53 రోజుల పాటు జైలులో ఉంచిన విషయం తెలిసిందే. జైలులో ఉన్నప్పుడు ఏపీ హైకోర్టులో బెయిల్ కోసం చంద్రబాబు పిటిషన్ దాఖలు చేసుకోగా మధ్యంతర బెయిల్ లభించింది. అనంతరం రెగ్యులర్ బెయిల్ ఇవ్వడంతో ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలు చేసింది.

## సైకిల్ పని ఖతమైంది.. జనం చేతిలో ముక్కలైంది



రాజానగరం: 14 ఏళ్లు సీఎంగా పని చేశానన్నాడు. మూడు సార్లు సీఎం అన్నాడు ఈ చంద్రబాబు. ఆయన పేరు ఎత్తితే.. పేదలకు ఒక్కటంటే ఒక్క మంచి పని గుర్తుకు వస్తుందా? బాబు పేరు చెబితే ఒక్క స్కీమ్ గుర్తుకు వస్తుందా? ఎన్నికల ముందు రకరకాల వాగ్దానాలు చేశాడు. అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చలేదు. ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారు. అని ఏపీ సీఎం జగన్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజవక వర్గంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబుపై సెటైర్లతో మాటల తూటాలు పేల్చారు. ఈ ప్రచారంలో జగన్ స్వరం మారింది. టీడీపీ, జనసేన, బీజేపీపై సెటైరిక్ మిసైల్స్ సంధించారు. ఇప్పటి వరకూ టీడీపీ, జనసేనను తూర్పారబట్టిన జగన్ ఇక.. బీజేపీపై విరుచుకుపడ్డారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చేదాకా అబద్ధాలు మోసాలు , మాయలు, చేస్తుంటారని, ఆయన మోసాలు ఎలా ఉంటాయో%ౌ% ఒక్కసారి మీ అందరికీ చూపిస్తానని, కూటమి మేనిఫెస్టోను దెప్పిపొడిచారు.

### అది తుక్కు సైకిల్.. మనకు అసలే వద్దు

“2019 ఎన్నికల్లో రైతన్నలు, ఆడపడుచులు, అన్ని సామాజిక వర్గాలు.. పల్లె పట్టణ ప్రజలంతా చంద్రబాబు సైకిల్‌ను ఏ ముక్కకు ఆ ముక్క విరిచి పక్కన పడేశారు. ఆ తుప్పు పట్టిన సైకిల్ రిపేర్‌కు చంద్రబాబు చాలా కష్టపడుతున్నారు. ఆ రిపేర్ క్రమంలో ముందు ఎర్ర చొక్కాల దగ్గరకు వెళ్తే.. ఫలితం రాలేదు. ఆ తర్వాత దత్త పుత్రుడ్ని పిలుచుకున్నాడు. తుప్పు పట్టింది.. నేను క్యారేజీ మీద మాత్రమే ఎక్కుతాను. గ్లాస్ పట్టుకుని టీ తాగుతా అని దత్త పుత్రుడు అన్నాడు. ఆ తర్వాత బాబు తన వదినమ్మను ఢిల్లీ పంపించారు. ఆమె ఢిల్లీ వెళ్లారు. అక్కడి నుంచి సైకిల్ రిపేర్ కోసం మెకానిక్‌ను పిలిపించారు. వాళ్లొచ్చి.. తుప్పు పట్టిన ఆ సైకిల్‌ని చూశారు. ఆ సైకిల్‌కు హ్యాండిల్ లేదు. సీటు లేదు. చక్రాల్లేవ్. పెడల్ లేదు. ట్యూబుల్లేవ్. మధ్యలో ఫ్రేమ్ కూడా లేదు. మరి ఇంతలా తుప్పు పడితే ఎలా బాగు చేస్తామయ్యా అని అడిగారు. పిచ్చి చూపులు చూసి బెల్ కొట్టడం మొదలుపెట్టాడు. ఆ ట్రింగ్ ట్రింగ్ బెల్ పేరే అబద్ధాల మేనిఫెస్టో” అని చంద్రబాబుపై జగన్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

### అన్నీ మోసాలే మాయ మాటలే

“మేనిఫెస్టో పేరుతో ఇదే పెద్ద మనిషి.. ఇదే ముగ్గురితో కలిసి కూటమిగా ఏర్పడి ఈ పాంప్లెట్ ఇచ్చారు స్వయంగా చంద్రబాబు సంతకం పెట్టి.. ఇంటింటికి పంపించారు. ఇందులో ఒక్కటంటే ఒక్కటైనా జరిగిందా” అని జగన్? ప్రశ్నించారు. ?1,97,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ జరిగిందా? రైతు రుణమాఫీపై తొలి సంతకం చేస్తానన్నాడు. మరి ?87,612 కోట్ల వ్యవసాయ రుణాల మాఫీ జరిగిందా? పొదుపు సంఘాల రుణాలన్నీ రద్దు చేస్తానన్నాడు. అక్కా చెల్లెమ్మల పొదుపు సంఘాల రుణాలన్నీ రద్దు చేస్తానన్నాడు. చెల్లెమ్మా ఏకంగా ?14,205 కోట్లు పొదుపు సంఘాలో రుణాలన్నీ మాఫీ చేస్తానన్నాడు. ఇందులో ఒక్క రూపాయైనా మాఫీ చేశాడా? ఆడ బిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద ? 25 వేలు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నాడు. కనీసం ఒక్క రూపాయి అయినా డిపాజిట్ వేశాడా? అని జగన్ ప్రశ్నించారు.

### బాబు వస్తే జాబు అన్నాడు.. జాబు వచ్చిందా?

ఇంటింటికీ ఉద్యోగం%ౌ% ఉద్యోగం ఇవ్వకపోతే ? 2వేల నిరుద్యోగ భృతి ప్రతి నెలా అన్నాడు. ఐదేళ్లు అంటే 60 నెలలు, నెలకు రెండు వేలు చొప్పున ప్రతి ఇంటికీ ? 1,20,000 ఇచ్చాడా?. అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇల్లు అన్నాడు. ఏ ఒక్కరికైనా కూడా ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చాడా? ?10,000 కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత పవర్ లూమ్స్ రుణాల మాఫీ అన్నాడు జరిగిందా? విమెన్ ప్రొటెక్షన్ ఫోర్సు ఏర్పాటు చేస్తామన్నాడు. చేశాడా? సింగపూరును మించి అభివృద్ధి చేస్తామన్నాడు చేశాడా? ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు జరిగిందా? రాజానగరంలో కనిపిస్తోందా? మరి నేను ఒక్కటే అడుగుతున్నాను. ఇదే ముగ్గురు 2014లో వంచించారు.. అయిదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా పని చేశారు. అయినా ఇందులో ఒక్కటైనా జరిగిందా? అని తీవ్ర స్వరంతో జగన్? ప్రశ్నించారు.

### మళ్లీ మోసానికి ఆ ముగ్గురే..

మళ్లీ ఇదే ముగ్గురు మళ్లీ కూటమిగా ఏర్పడ్డారు. మేనిఫెస్టో డ్రామాలాడుతున్నారు. సూపర్ సిక్స్ అంటున్నారు. నమ్ముతార? సూపర్ సెవెన్ అంట నమ్ముతారా? ఇంటింటికీ కేజీ బంగారం ఇస్తారంట, నమ్ముతారా? అక్కా నమ్ముతారా? ఏమ్మా నమ్ముతారా? ఇంటింటికీ బెంజికారు కొనిస్తారట నమ్ముతారా? ఎన్నికలకు రెండు నెలల ముందు అవ్వాతాతలకు ఇంటికి పెన్షన్ రాకుండా అడ్డుకున్నారు. ఆ బటన్లు నొక్కిన సొమ్ముకూడా రాకుండా కలిసి ఢిల్లీ వాళ్లతో కుట్రలు చేస్తున్నారు. స్వయానా ఒక సీఎం కోర్టుకి వెళ్లి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించే స్థాయికి రాజకీయం దిగజారిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

### మీ భూ సమస్యలను పరిష్కరిస్తా..

ఈ ప్రాంతంలో భూముల సమస్య గురించి తెలుసు. అధికారంలోకి వచ్చాక ఈ సమస్యను పరిష్కరించి.. మీ ముందుకు మళ్లీ వస్తా.. మీ అందరిని కోరేది ఒక్కటే. జరగబోయే కురుక్షేత్రంలో 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25కు 25 ఎంపీ స్థానాలు తగ్గేందుకు వీలేలేదు, మంచి చేసిన ఈ ఫ్యాను ఇంట్లోనే ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింకులోనే ఉండాలి. రాజానగరం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా జక్కంపూడి రాజాకి ఓటేయండి.. ఛీటింగ్ కేసుల్లోని వ్యక్తికి ఓటేయకండి. అలాగే.. ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాసులను గెలిపించాలని జగన్ అభ్యర్థించారు.

## మండుటెండల నుంచి ఊరట.. తెలంగాణలో ఐదురోజులు వర్షాలే..!

హైదరాబాద్, తెలంగాణలో రాగల ఐదుజిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, జనగాం, భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటలకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. మరికొన్ని జిల్లాల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఆదిలాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ అయ్యింది. బుధవారం పలుచోట్ల తేలికపాటి చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 9న ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలతో పాటు మెదక్, కామారెడ్డి,



మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాలో వర్షాలు పడుతాయని పేర్కొంది. గురు, శుక్రవారాల్లోనూ పలు చోట్ల ఈదురుగాలులతో వానలు పడే అవకాశాలున్నాయని వాతావరణశాఖ వివరించింది.

## కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం.. రాహుల్ గాంధీ సభ రద్దు

కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో ఈదురు గాలులతోకూడిన భారీ వర్షంకురిసింది. పొద్దంతా భానుడి భగభగలతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు చోట్ల టెంట్లు కుప్పకూలి పోయాయి.సమయానికి టెంట్ల కింద ఎవరు లేక పోవడంతో పెను తప్పిన ప్రమాదం తప్పింది. దీంతో కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సభ రద్దు అయింది. కాగా, జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్రాల్లోని రైతుల ధన్యం తడిసిపోయింది. చెట్లు విరిగి పడటంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



## సంపాదకీయం

బుధవారం 08-05-2024

# పరస్పర విమర్శలకే నేతల ప్రాధాన్యం

ఎన్నికల్లో అన్ని అంశాలు పక్కకు పోతున్నాయి. దూషణల పర్వం విపరీతంగా ముందుకు పోతోంది. ఎంత ఎక్కువగా దూషిస్తే అంతగా పాపులారిటీ అన్న పంథాలో పార్టీలు, వాటి నేతలుముందుకు సాగుతున్నారు. రాజకీయాల్లో ఇలాంటి అవాంఛనీయ వ్యవహారాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రధాని మోడీ సైతం ఇదే పంథాలు సాగుతున్నారు. ఎపిలో జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పరస్పర దూషణలు చేసుకోవడంతోనే ప్రచారాన్ని హైటెల్ చేస్తున్నారు. తెలంగాణలో కూడా ఇదే తరహా పరిస్థితి ఉంది. అధికార కాంగ్రెస్, విపక్ష బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు పదేపదే విమర్శలతో కాలం గడుపుతున్నారు. సవాళ్లు విసరుతున్నారు. నిజానికి ప్రజలకు ఇవన్నీ అవసరం లేదు. ఏం చేస్తారో చెప్పాలి. ఏం చేశామో చెప్పాలి. ఎపినే తీసుకుంటే..రాష్ట్ర విభజన తరువాత 2014–19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం మిగిలిన అంశాలను విస్మరించి కేవలం రాజధాని భూముల సమీకరణ, సింగపూర్ నమూనా తదితర అంశాలకే పరిమితమైంది. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం ఆలోచనలు చేయలేదు. 2019–2024 మధ్య పాలించిన వై.యస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం 'బటన్ నొక్కుడు' పరిమితమై మిగిలిన అన్ని అంశాలను నిర్లక్ష్యం చేసింది. మౌలిక వసతులలో భాగంగా కనీసం రోడ్ల నిర్మాణం కూడ చేయలేదు. టిడిపి–జనసేన కూటమి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోలో అభివృద్ధికి అవసరమైన అంశాలను తాము విస్మరించిన తీరును ప్రజలు గుర్తించకుండా ఉండటానికే ఎన్నికల ప్రచారంలో పరస్పర దూషణలు, వ్యక్తిగత దూషణలు చేసుకుంటున్నాయి. అభివృద్ధి అంశాలను ప్రస్తావించకుండా కేవలం సంక్షేమ అంశాలకే పరిమితమైనారు. అభివృద్ధి– సంక్షేమాన్ని సమతుల్యం చేయాలనే ఉద్దేశం మూడు ప్రాంతీయ పార్టీలకు లేకపోగా, మూడు పార్టీలు కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వానికి అంటకాగటంపైనే దృష్టి సారించారు. మోడీ ముందు మోకరిల్లే రాజీకాయలకు పరిమితం అయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి స్పష్టమైన విధానాలు ప్రకటించలేక పోతున్నారు. మూడు ప్రాంతీయ పార్టీలు విస్మరించిన అంశాలపై వాటిని నిలదీయాల్సిన అవసరముంది.సాధారణంగా ప్రాంతీయ పార్టీలు ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల నుంచి ఉద్భవించి, తమ రాష్ట్ర ప్రయోజనాల సాధన కోసం పోటీ పడతాయి. తెలుగుదేశం పార్టీ 1982లో 'ఆంధ్రుల ఆత్మగౌరవం' నినాదంతో ఏర్పడింది. ఉమ్మడి ఎపిలో పార్టీ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జీవితాంతం అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన అందించారు. కానీ పదవీచ్యుడుతు కావడంతో ఆయన ప్రతిభ పోయింది. చంద్రబాబు హయాంలో కొంత అభివృద్ధి సాగింది. కానీ జగన్ పాలనలో విడివడ్డ ఎపి అప్పులకుప్పగా మారింది. తెలంగాణలో కెసిఆర్ అభివృద్ధి ముసుగేసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసింది. 1980వ దశకంలో శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వానగల కేంద్రప్రభుత్వ ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ఎన్.టి.రామారావు, జ్యోతిబసు, రామకృష్ణ హెగ్డే, మొదలగు నాయకులు సమావేశాలు జరిపి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, కేంద్ర–రాష్ట్ర సంబంధాలలో మార్పు తెచ్చి, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా సర్కారియా కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. మోడీ అధికారంలోకి వచ్చాక నీతి ఆయోగ్ ఏర్పాటు చేశారు. ప్రణాళికా సంఘాన్ని తొలగించారు. కానీ రాష్ట్రాలకు చేయూతనిచ్చి అభివృద్దిలో భాగస్వామ్యం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇకపోతే తాజా ఎన్నికల్లో కూడా అభివృద్ధి నినాదం వెనక్కి పోయింది. మూడు ప్రాంతీయ పార్టీల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను విస్మరించాయి. గత పదేళ్లుగా ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణం మొదలగు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి, పోరాడి హక్కులను సాధించుకోవడానికి బదులు కేంద్రానికి సాగిలబడ్డాయి. భావితరాలకు అన్యాయం చేసేవిధంగా మూడు ప్రాంతీయ పార్టీల ఎన్నికల మ్యానిఫెస్టోలలో ఈ అంశాలు కనిపించలేదు. ప్రత్యేక హోదా గురించి మూడు ప్రాంతీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలలో చేర్చలేదు.ప్రత్యేక హోదా వలన రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలు, పన్ను రాయితీలు లభించి పారిశ్రామికాభివృద్ధి జరుగుతుంది. ప్రత్యేక హోదా కోసం గత దశాబ్ద కాలంలో అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ వాటిని అణచివేయడానికే ప్రయత్నించారు. ఒక్కసారి కూడా ప్రత్యేక హోదాపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించటానికి ప్రయత్నించలేదు. ఎన్నికల మ్యానిఫెస్టోలలో ప్రత్యేక హోదాను విస్మరించటం శోచనీయం.త దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి జరగలేదు. మూడు ప్రాంతీయ పార్టీలకు పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై స్పష్టమైన దృక్పథం లేదు. రాష్ట్రంలో ఐ.టి రంగం, ఫార్మా రంగం, టెక్స్టైల్స్, వ్యవసాయాధారిత పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు. విశాఖపట్నంతో పాటు తిరుపతి, అనంతపురం, ప్రకాశం జిల్లాలో దొనకొండ, గన్నవరం తదితర ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. నిరుద్యోగులకు ప్రభుత్వ శాఖలలో ఖాళీగా వున్న ఉద్యోగాలతో పాటు, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి. పెద్ద సంఖ్యలో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులరైజేషన్‌తో ఉద్యోగ భద్రత కల్పించాలి. అనేక రాష్ట్రాలలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో సిపిఎస్ రద్దు గురించి 2014–19 మధ్య తెలుగుదేశం, 2019–2024 మధ్య వైఎస్ఆర్ ప్రభుత్వం మాట తప్పాయి. ఇప్పుడు ఎన్నికల మ్యానిఫెస్టోలలో సిపిఎస్ గురించి చర్చిస్తామని చెప్పారు తప్పితే రద్దు చేస్తామని మూడు పార్టీలూ పేర్కొనలేదు. ఇక తెలంగాణలో ఇదే పరిస్థితి నెలకొంది. పరస్పర విమర్శలు చేసుకోవడంతోనే కాలం గడిపేస్తున్నారు. ఈ క్రమంలోప్రజలే దీనిని గుర్తించి ఓటేయాలి. చైతన్యం ప్రదర్శించాలి.

# ఎన్నికల వ్యూహంగానే యూటీ మాటలు!.. ప్రచారాస్త్రం కోసం బీఆరెస్ పాట్లు




హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో దెబ్బతిన్న బీఆరెస్.. పార్లమెంటు ఎన్నికల్లోనైనా సత్తా చాటేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నది. అయితే అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదురవుతుండటంతో ఆ రెండు పార్టీలను దాటి ఓటర్లు బీఆరెస్‌కు ఓటువేసేలా వ్యూహాలు పన్నుతున్నట్టు కనిపిస్తున్నది. ఇందుకోసం పలు అంశాలను ప్రచారంలో లేవనెత్తుతున్నప్పటికీ.. ఒకవైపు రాముడు, మతపరమైన రిజర్వేషన్ల అంశంపై బీజేపీ, రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగ మార్పుపై కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంతో బీఆరెస్ లేవనెత్తుతున్న అంశాలు ఆ పార్టీ ఆశించినంతగా ప్రజల్లో వెళ్లటం లేదనే చర్చ నడుస్తున్నది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌ను యూటీ చేస్తారని బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరికొంతకాలం కొనసాగిస్తారని మాజీ మంత్రి హరీశ్‌రావు కొత్త ప్రచారాన్ని ఎత్తుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీని ద్వారా తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి, ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో బీఆరెస్‌కు ట్యాగ్‌లైన్ ప్రచారాంశం కొరత స్పష్టంగా కనిపిస్తూ వస్తున్నది. ఇప్పటిదాకా జరిగిన ప్రచార సభల్లో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తమకు కలిసొచ్చిన తెలంగాణ సెంటిమెంట్.. ఉద్యమకాలం నాటి ప్రచారాంశాలలో భాగమైన కృష్ణా, గోదావరి నదీ జలాల సమస్యలు, రైతులు, ప్రజల సాగు, తాగునీటి సమస్యలు, విద్యుత్తు సమస్యలపై ప్రధానంగా ప్రస్తావిస్తూ వస్తున్నారు. అయితే బీజేపీ, కాంగ్రెస్ ప్రచారాస్త్రాల ముందు బీఆరెస్ లేవనెత్తిన అంశాలు రొటీన్‌గా ఉండటంతో బీఆరెస్ జనాన్ని కదిలించే అంశాన్ని వెతికే పనిలో ఆ పార్టీ నాయకత్వం పడిందని అంటున్నారు.

**అందుకే యూటీ.. ఉమ్మడి రాజధాని!**

పార్లమెంటు ఎన్నికల్లో ఉనికి కోసం పోరాడుతున్న బీఆరెస్‌కు ఒక్క సీటు కూడా రాదని కాంగ్రెస్, బీజేపీలు భయపెడుతున్నాయి. పలు సర్వే సంస్థలు సైతం అటు ఇటుగా అవే కథనాలను వినిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పార్టీ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా బడా నాయకులు.. క్యాడర్ ఒక్కొక్కరుగా పక్క పార్టీల్లోకి వలసలు పోతున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆరెస్‌కు గౌరవప్రదమైన స్థానాలు దక్కకపోతే ఈ వలసలు మరింత పెరుగుతాయన్న బెంగ గులాబీ నాయకత్వాన్ని పీడిస్తున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీని, క్యాడర్‌ను కాపాడుకోవాలంటే పార్లమెంటు ఎన్నికల్లో కనీసం ఐదారు స్థానాలైనా గెలవాల్సిన అనివార్య పరిస్థితి పార్టీ నాయకత్వానికి విషమ పరీక్ష పెడుతున్నదని అంటున్నారు. అయితే రాష్ట్రంలో ముక్కోణపు పోటీలో బీఆరెస్ వెనుకబడిపోయిందన్న ప్రచారాన్ని అధిగమించి జనంలో తాము గెలుస్తున్నామన్న నమ్మకాన్ని కల్గించాలంటే ప్రచారం చివరి దశలోనైనా దూకుడు పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. అందుకే హరీశ్‌రావు మరోసారి ఉమ్మడి రాజధాని అంశాన్ని తెరపైకి తెచ్చారని పరిశీలకులు అంటున్నారు.రాష్ట్ర విభజన ప్రకారం హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగిసినప్పటికీ, దానిని పొడిగించాలని చూస్తున్నారని, ఇందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని సంచలన విమర్శలు చేశారు. వాళ్ల ఆటలు సాగకూడదనుకుంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆరెస్‌ను గెలిపించాలంటూ కొత్తరాగం అందుకున్నారు. బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సైతం అదే తరహా వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసి, ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ ఏడాది జూన్ 2 వరకే హైదరాబాద్ నగరం.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి రాజధానిగా ఉంటుందని.. ఆ తర్వాత కాంగ్రెస్, బీజేపీ కలిసి హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేస్తారంటూ కీలక కామెంట్స్ చేశారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఇప్పటికే ఒప్పందం కుదిరిందని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం కాకుండా అడ్డుకునేది బీఆరెస్ పార్టీ మాత్రమేనని కేటీఆర్ పేర్కొన్నారు. దీంతో మళ్లీ ఉమ్మడి రాజధాని..హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం కాబోతుందన్న భయాలను, బెంగను ప్రజల్లో రగిలించి అలా జరుగకూడదంటే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ఇంటిపార్టీ బీఆరెస్‌ను గెలిపించాలని కోరుతున్నారు. మరో అడుగు ముందుకేసి 2026 నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ (డీలిమిటేషన్)లో తెలంగాణకు అన్యాయం జరగకుండా అడ్డుకునే శక్తి, బీజేపీ రాజ్యాంగం మార్చకుండా ఆపే పవర్ కూడా బీఆరెస్‌కే ఉందని, అందుకు లోక్‌సభ ఎన్నికల్లో బీఆరెస్‌ను 12 ఎంపీ సీట్లలో గెలిపించాలని కోరుతున్నారు.

**యూటీ నిర్ణయం సాధ్యమేనా!**

నిజానికి హరీశ్‌రావు, కేటీఆర్ చెప్పినట్లుగా కేంద్రం హైదరాబాద్‌ను యూటీగా మార్చడం సాధ్యమేనా అన్న చర్చ సాగుతున్నది. హైదరాబాద్‌కు నలువైపులా రక్షణ శాఖ భూములు ఉండటం, రక్షణ పరంగా హైదరాబాద్ సున్నితమైన ప్రాంతం కావడంతో ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత పెద్దగా రాదనీ, ఒక వేళ వచ్చినా హస్తినను ఉదాహరణగా చూపి వ్యతిరేక గళాలను సముదాయించవచ్చని గతంలో కేంద్ర వర్గాలు భావించాయి. బీఆరెస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు గతంలో రాష్ట్ర విభజనకు ముందు.. ఏదో విధంగా రాష్ట్రం సాధించుకోవడమే లక్ష్యంగా హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం అన్న ప్రతిపాదనకు ఒక దశలో మొగ్గు చూపినట్టు వార్తలు వచ్చినా.. చివరకు ప్రజాభిప్రాయం మేరకు హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ నినాదానికే కట్టుబడ్డారు. దక్షిణ భారత దేశంలో కీలక నగరంగా ఉన్న హైదరాబాద్‌ను యూటీగా చేసే అంశం తరచూ తెరపైకి వస్తూనే ఉంది. అయితే అలాంటి ఆలోచన ఏదీ బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో ప్రస్తావించలేదు. దీంతో బీఆరెస్ నేతలు చెబుతున్నట్లుగా హైదరాబాద్ యూటీ అంశం పట్ల బీజేపీ కేంద్ర నాయకత్వం ఆసక్తిగా లేదంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

**ఉమ్మడి రాజధాని ముచ్చట ముగిసిన అధ్యాయమే**

హైదరాబాద్ పదేళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగుతుందని ప్రకటించిన గడువు ఈ ఏడాది జూన్ 2తో ముగుస్తుంది. హరీశ్‌రావు తాజాగా ఆరోపించినట్లుగా చంద్రబాబు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కావాలని ఏపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎక్కడా కోరకపోగా, టీడీపీకి అధికారం ఇస్తే అమరావతి రాజధాని నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం 2015లోనే అమరావతిని రాజధానిగా ప్రకటించింది. ఆ తర్వాత కొద్ది నెలల్లోనే హైదరాబాద్ నుంచి అమరావతికి మకాం మార్చేసింది. ఇక 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అమరావతి స్థానంలో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. 2019లో తెలంగాణ మంత్రివర్గం కోరిక మేరకు హైదరాబాద్‌పై హక్కులన్నీ జగన్ ప్రభుత్వం వదిలేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఏపీకి సంబంధించిన ఒక్క కార్యాలయం కూడా లేదు. ఆ మధ్య ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసీపీ మంత్రులు పలువురు మళ్లీ ఉమ్మడి రాజధాని అంశం తెరపైకి తెస్తే టీడీపీ తీవ్రంగా ఎదురుదాడికి దిగింది. దీనిపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సైతం ఘాటుగా స్పందించారు. ఏపీకి అమరావతే రాజధాని అని బీజేపీ చెబుతోందని స్పష్టం చేశారు. ఇప్పుడు ఆత్మనిర్భర్ ఆంధ్రప్రదేశ్ కావాలి అని పిలుపునిచ్చారు. వేరే రాష్ట్రం నుంచి రాజధానిని తీసుకోవాల్సిన అగత్యం ఏపీకి లేదన్నారు. హైదరాబాద్ ను పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఇస్తే దాన్ని ఉపయోగించుకున్న దాఖలాలు లేవని,. మళ్లీ ఛలో హైదరాబాద్ అని ఎందుకంటున్నారని జీవీఎల్ విమర్శించారు. సొంత రాజధాని నిర్మించుకోలేకపోయిందన్న అప్రతిష్ఠ ఏపీకి ఎందుకు? మళ్లీ వెళ్లి పక్క రాష్ట్రంపై ఆధారపడతామనడం సబబేనా? అని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ సైతం మళ్లీ హైదరాబాద్ జోలికొస్తే ఊరుకోమంటూ హెచ్చరించారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు హైదరాబాద్‌ను మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా కొనసాగించేందుకు చట్టం తెచ్చేలా కేంద్ర హోంశాఖను ఆదేశించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రజాసంక్షేమ సేవ సంఘం కార్యదర్శి పొదిలి అనిల్‌కుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో నిర్దేశించిన చట్టబద్ధమైన విధులు నిర్వర్తించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పులు తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న కంపెనీలు, కార్పొరేషన్ల ఆస్తుల విభజన పూర్తి కాలేదని తెలిపారు. వివాదాలు పరిష్కారమయ్యేవరకు మరో పదేళ్లపాటు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగిస్తూ చట్టం చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం.. చట్టం చేయాలని పార్లమెంట్‌ను తాము ఎలా ఆదేశించగలమని ప్రశ్నించింది. ఆ వ్యాజ్యాన్ని కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఉమ్మడి రాజధాని అంశం ముగిసిన అధ్యాయమని.. ఇప్పుడు బీఆరెస్ నేతలు చేస్తున్న హైదరాబాద్ ఉమ్మడి రాజధాని.. లేక యూటీ ప్రచారం అంతా ఎన్నికల వ్యూహంగానే చూడాలంటున్నారు రాజకీయ విశ్లేషకులు.


## జగిత్యాలలో గురువు రమణయ్యకు కెసిఆర్ పరామర్శ

జగిత్యాల, జగిత్యాలలో తన గురువు, ప్రముఖ కవి, రచయిత జైశెట్టి రమణయ్య ఇంటికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వెళ్లారు. కేసీఆర్ సిద్దిపేటలో ఇంటర్ చదువుకునే రోజుల్లో హిస్టరీ సబ్జెక్ట్ చెప్పిన గురువు జైశెట్టి రమణయ్య. అనారోగ్యంతో బాధపడుతున్న రమణయ్యతో పాటు ఆయన కుటుంబ సభ్యులతో కేసీఆర్ మాట్లాడారు. బస్సు యాత్రలో భాగంగా జగిత్యాలలో బస చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, స్థానికంగా నివాసం ఉంటున్న తన చిన్న నాటి గురువు ప్రముఖ కవి జైశెట్టి రమణయ్య వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. వయోభారంతో అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న వారిని కేసీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా తాను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో సిద్దిపేట జూనియర్ కాలేజీలో హిస్టరీ లెక్చరర్ గా తనకు చరిత్ర పాఠాలు నేర్పిన నాటి జ్ఞాపకాలను కేసీఆర్ నెమరు వేసుకున్నారు. సిద్దిపేట జిల్లా కావాలని 30 ఏండ్ల కిందనే కేసీఆర్ నాటి కేంద్ర మంత్రికి వినతిని అందించిన విషయాన్ని గురువు రమణయ్య గుర్తు చేశారు. ప్రజలను చైతన్యం చేసి ఉద్యమానికి నాయకత్వం వహించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత నీదేనని తన శిష్యుడు కేసీఆర్ ను కొనియాడారు. సాధించిన రాష్ట్రాన్ని అనతి కాలంలోనే అభివృద్ధి చేసి తెలంగాణ ఔన్నత్యాన్ని దేశంలో నిలిపావని మెచ్చుకున్నారు.కష్టాలను నష్టాలను సుఖాలను బాధలను జయాలను అపజయాలను సమ స్థితిలో స్వీకరించడం కేసీఆర్ కు చిన్ననాటి నుండీ అలవాటేనని అదే ఆయన విజయాలకు మూలమని, అదే స్థిత ప్రజ్ఞతను కొనసాగిస్తూ భవిష్యత్తులో విజయాలు సాధిస్తూ తెలంగాణ ప్రజల కన్నీళ్లు తూడ్చడంలో ముందుండాలని, తెలంగాణ ప్రజల సంక్షేమానికి ఇంకా చాలా చేయాల్సి ఉన్నదని తన శిష్యునికి రమణయ్య ఉద్భోదించారు. తనను పరామర్శించడానికి వచ్చిన శిష్యుడు కేసీఆర్ తో పావుగంట పాటు ఇష్టాగోష్టి కొనసాగించారు. అనంతరం గురువు వద్ద మరోసారి ఆశీర్వాదం వీడ్కోలు తీసుకుని తన పదమూడో రోజు బస్సు యాత్రను కొనసాగించేందుకు కేసీఆర్ ముందుకు కదిలారు.

## బిజెపి గురించి వ్యతిరేకంగా మాట్లాడితే కష్టమే

ఖమ్మం,బీజేపీ గురించి వ్యతిరేకంగా మాట్లాడితే ఈడీ, ఐటీ రైడ్స్ చేయిస్తున్నారంటూ బీజేపీపై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బిజెపి తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం ప్రసాద్ హైట్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రసాద్ హైట్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ సందర్భంగా రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో ఉండేవారు చాలా చైతన్య వంతులన్నారు. బీజేపీ గురించి మాట్లాడితే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విరుచుకుపడ్డారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తాం అంటున్నారని.. 10 ఏళ్లు అధికారంలో ఉండి కొత్తగూడెం రైల్వే లైన్‌ను ఎందుకు వేయించలేదని ప్రశ్నించారు. రాముడిని కొలిచేది తామే అన్నట్లు రాముడిని రాజకీయాల్లోకి బీజేపీ లాగుతోందని మండిపడ్డారు. గతంలో గ్యాస్ ధర కేవలం రూ.500 ఉండేది, బీజేపీ వచ్చాక మాత్రం ఆ ధర అందలానికి ఎక్కిందన్నారు. బీఆర్ఎస్ సుమారు 3 వేల రోజులు అధికారంలో ఉందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కేవలం 140 రోజులే అవుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో సుమారు అన్ని అయినట్లే అని చెప్పుకొచ్చారు. 10 ఏళ్లు పరిపాలన చేసి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ధరణి ద్వారా రాష్ట్రంలో ఉన్న చికాకులను కాంగ్రెస్ ప్రభుత్వం మీద పడేలా చేశారన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు శక్తివంతులైన నాయకులు ఉన్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ ఖమ్మం జిల్లాకు ఇంత శక్తివంతమైన నాయకులు లేరన్నారు. కాబట్టి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. 'నాకు ఒక్క అవకాశం ఇవ్వండి ఖమ్మం జిల్లాను వదలకుండా ఉంటాను' అని రామ సహాయం రఘురాంరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రఘురాంరెడ్డి కోడలు దగ్గుబాటి ఆశ్రిత పాల్గొని ప్రసంగించారు. 'మా మామ గురించి మాట్లాడాలి అంటే ఇక్కడ రోజంతా ఉండాల్సి వస్తుంది. ఆయన జిల్లాకు సేవ చేయాలన్న సంకల్పంతో ఉన్నారు . ఆయన వారి కొడుకు మాట కంటే ఎక్కువగా నా మాటే వింటారు. ఆయనకు మద్దతుగా మా నాన్న రేపు ఖమ్మంలో పర్యటిస్తారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపిస్తారని కోరుకుంటున్నాను' అని ఆశ్రిత పేర్కొన్నారు.

# సునీతా విలియమ్స్ రోదసి యాత్రకు బ్రేక్..!



కేప్ కెనావెరాల్ : భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ రోదసి యాత్ర నిలిచిపోయింది. వారు వెళ్లాల్సిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకను మోసుకెళ్లాల్సిన రాకెట్‌లో సాంకేతికత లోపం తలెత్తడమే దీనికి కారణమని నాసా ప్రకటించింది. భారత కాలమానం ప్రకారం %ౌ% మంగళవారం ఉదయం 8.04 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లాల్సి ఉంది. కానీ, చివర్లో గుర్తించిన లోపం కారణంగా ప్రస్తుతానికి ఈ మిషన్‌ను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రకటించింది. తిరిగి ఎప్పుడు చేపడతారనేది మాత్రం వెల్లడించలేదు.

**సరిగ్గా 90 నిముషాల ముందు**

%ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్‌లో ఉన్న కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బోయింగ్‌కు చెందిన అట్లాస్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లడానికి సిద్ధమైంది. సరిగ్గా 90 నిమిషాల ముందు మిషన్‌ను ఆపేస్తున్నట్లు నాసా ప్రకటించింది. రాకెట్‌లోని ఆక్సిజన్ రిలీఫ్ వాల్వ్ పనితీరు అసాధారణంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. అప్పటికే వ్యోమనౌకలోకి ప్రవేశించిన సునీతా విలియమ్స్‌తో పాటు మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

**మొదటిసారి స్టార్‌లైనర్‌తో మానవసహిత యాత్ర**

తాజా మిషన్‌లో భూకక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వారం పాటు బసచేయాలనేది ప్రణాళిక. స్టార్‌లైనర్ అభివఅద్ధిలో అనేక ఇబ్బందులు తలెత్తాయి. 2019లో ప్రయోగాత్మకంగా చేపట్టిన స్టార్‌లైనర్ తొలి మానవరహిత యాత్ర ఐఎస్ఎస్‌ను చేరుకోలేకపోయింది. మరో యాత్రలో పారాచూట్ సమస్యలు తలెత్తాయి. దీనివల్ల ఈ ప్రాజెక్టులో చాలా సంవత్సరాలు జాప్యం జరిగింది. స్టార్‌లైనర్‌తో మానవసహిత యాత్ర నిర్వహించడం ఇదే మొదటిసారి. తాజాది విజయవంతమైతే ఐఎస్ఎస్‌కు వ్యోమగాములను చేరవేసే రెండో వ్యోమనౌక అమెరికాకు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం స్పేస్ఎక్స్ వ్యోమనౌక ఈ సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే.

**సునీతకు ఇది మూడో అంతరిక్ష యాత్ర..**

మిషన్ పైలట్‌గా వ్యవహరించాల్సిన సునీతకు ఇది మూడో అంతరిక్ష యాత్ర. గతంలో ఆమె 2006, 2012లో రోదసిలోకి వెళ్లారు. మొత్తం 50 గంటల 40 నిమిషాల పాటు స్పేస్‌వాక్ నిర్వహించారు. 322 రోజులపాటు అంతరిక్షంలో గడిపారు. మునుపటి యాత్రలో భగవద్గీతను తీసుకెళ్లిన ఆమె ఈసారి తన ఆరాధ్య దైవం గణపతి విగ్రహాన్ని వెంట పట్టుకెళ్లనున్నట్లు వెల్లడించారు. స్టార్‌లైనర్‌కు ఇది మొదటి మానవసహిత యాత్ర కావడం వల్ల ఒకింత ఆత్రుతగా ఉందని అంతకుముందు వెల్లడించారు. అయినప్పటికీ గాబరా పడిపోయే పరిస్థితి ఏమీ లేదని చెప్పారు.

## రైతులకు 500 రూపాయల బోనస్

వరంగల్,వర్షాకాలం పంట నుండి రైతులకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజ్ ఠాకుర్ అన్నారు. స్వామినాథన్ కమిటీ రిపోర్ట్ ఆధారంగా ప్రతి పంటకు మద్దతు ధరతో పాటు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపారు. అగస్టు 15వ తేదీలోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని దేశంలో ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వంద రోజులు ఉన్న ఉపాధి కూలీ పనిదినాలను 200 రోజులు చేస్తామని వెల్లడించారు.

# పంటనష్టపోయిన రైతులకు పరిహారం

హైదరాబాద్,తెలంగాణలో పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో పంట నష్టపోయిన బాధిత రైతులకు పంట నష్టం నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. ఈ మేరకు జీవో విడుదల చేసింది. పంట నష్టం నిధులు విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 15,814 ఎకరాల్లో పంట నష్టం జరుగగా.. 15,246 మంది రైతులకు రూ. 15.81 కోట్ల నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. కాగా, రాష్ట్రంలో అత్యధికంగా కామారెడ్డిలో 10,000 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇకపోతే తెలంగాణలో రైతులకు ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఐదు ఎకరాలు పైబడిన రైతులు అందరికీ ఈ నిధులు జమ అయినట్లుగా ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతు భరోసా నిధులను మే 6 నుంచి రైతుల అకౌంట్లలో జమ చేస్తామని ప్రభుత్వం ఇంతకుముందే ప్రకటించింది. 3 రోజులపాటు 39 లక్షల ఎకరాలకు నిధులు పంపిణీ జరగనుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంచనా. రైతు భరోసాను బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు బంధుగా పిలిచేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులను సకాలంలో రైతులకు జమ చేయలేదని బీఆర్ఎస్ కీలక నేతలు ఇటీవలి ఎన్నికల ప్రచారంలో తరచూ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై కొద్ది రోజుల క్రితమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఆ నిధులను డిసెంబరులోనే జమ చేయడం మొదలుపెట్టామని.. మొత్తం 69 లక్షల మంది రైతులకు గాను ఇప్పటివరకు 65 లక్షల మందికి అందించినట్లు స్పష్టం చేశారు. మిగిలిన 4 లక్షల మంది ఖాతాల్లోకి మే 9వ తేదీలోపు రైతు భరోసా నిధులను వేస్తామని చెప్పారు. ఖమ్మం నుంచి అలంపూర్ వరకు ఏ ఒక్క రైతుకు రైతు భరోసా నిధులు అందకపోయినా తాను హైదరాబాద్ లోని అమరవీరుల స్తూపం వద్దకు వచ్చి.. బహిరంగ చర్చలో పాల్గొని, ముక్కు నేలకు రాసేందుకు సిద్ధమని అన్నారు. ఒకవేళ 9లోపు రైతులందరికీ మిగిలిన రూ.7,500 కోట్లు జమ చేస్తే.. తమకు కేసీఆర్ క్షమాపణలు చెప్పగలరా అని సవాలు విసిరారు. కేసీఆర్ ముక్కు నేలకు రాసేందుకు సిద్ధమా' అని ప్రశ్నించారు.

# కేంద్ర పథకాలు జగన్ సొంత సోకులు

రాజమహేంద్రవరం,ఏపీ సీఎం జగన్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి పడకేసిందని వివరించారు. రాజమహేంద్రవరంలో జరిగిన ప్రజాగళం సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సొంత పథకాలుగా సీఎం జగన్ బిల్డప్ ఇచ్చారని విమర్శించారు. వాటికి జగనన్న కాలనీలు అని పేరు పెట్టుకున్నారని విమర్శించారు. జగన్ హయాంలో కుంభకోణాలకు లెక్కే లేదని తెలిపారు. మోదీ వికసిత్ భారత్ కలలో తాము కూడా భాగస్వాములం అవుతామని స్పష్టం చేశారు. 'దేశానికి అభివృద్ధితోపాటు గుండె ధైర్యం అవసరం అని, శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే గుండె ధైర్యం కావాలని పవన్ కల్యాణ్ అభిప్రాయ పడ్డారు. మోదీ లాంటి నేత కేంద్రంలో ఉండటంతో గత పదేళ్లుగా భారత్ వైపు చూడాలంటే మిగతా దేశాలు భయపడుతున్నాయని వివరించారు. మోదీ గొంతెత్తితే దేశంలోని అణువణువూ స్పందిస్తోంది' అని స్పష్టం చేశారు. హిమాలయ పర్వతాలంత ఎత్తైన జాతీయత మాకు ఉంది.. మోదీ ముందుండి ఏపీని నడిపించాలని కోరారు. గతంలో పద్మ అవార్డులు రాజకీయాలు చేసే వారికి మాత్రమే వచ్చేవని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మోదీ హయాంలో అర్హులకు పద్మ అవార్డులు దక్కుతున్నాయని పేర్కొన్నారు. 135 పద్మశ్రీ అవార్డులు దక్షిణ భారతీయులకు ఇచ్చిన ఘనత మోదీకి దక్కుతుందని పేర్కొన్నారు. భారత్ శక్తిని ప్రపంచానికి చాటిన మహానుభావుడు మోదీ అని స్పష్టం చేశారు. విష ఘడియలు నుంచి అమృత ఘడియలు వైపు మోదీ తీసుకువెళ్లాలని.. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతున్నారు అని' స్పష్టం చేశారు.జగన్ ఐదు కోట్ల మందిని హింసిస్తున్నాడని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. జగన్ అవినీతి పాలన అంతమొందించేందుకు మోదీతో కలిసి పనిచేస్తున్నాం అని వివరించారు. అయోధ్యకు శ్రీరామచంద్రుడిని తీసుకొచ్చిన మహానుభావుడు మోదీ అని' పవన్ కల్యాణ్ ప్రశంసలు కురిపించారు.

# వరంగల్‌కు ఎయిర్‌పోర్టు ఇవ్వకుండా మోసం

వరంగల్, వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని పార్టీ అభ్యర్థి సుధీర్ కుమార్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. తాను స్థానికుడినని, తన బర్త్ సర్టిఫికేట్ తనకు ఇక్కడే దొరుకుతుందని, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు స్థానిక సర్టిఫికెట్ ఇక్కడ దొరకదన్నారు. తనపై భూకబ్జా ఆరోపణ లేవని, అలాంటివి భవిష్యత్‌లో కూడా చేయని స్పష్టం చేశారు. వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందన్నారు. ఎయిర్‌పోర్టు వస్తే వరంగల్ ముఖచిత్రమే మారిపోతుందని చెప్పారు. అజంజాహి మిల్లును కాంగ్రెస్ పార్టీ ధ్వంసం చేసిందని విమర్శించారు. వరంగల్‌లో అనేక సహజ వనరులు ఉన్నా.. ఎగుమతి కావట్లేవని చెప్పారు. సింగరేణి బొగ్గుకు అధిక ధర రావడం లేదని, ఇక్కడ పండే వరి, మిర్చి పంటలకు ధర రాక రైతులు నష్టంపోతున్నారని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు దేశంలో 28 రాష్ట్రాలు ఉన్నాయి, బీఆర్ఎస్‌కు మాత్రం ఒకే రాష్ట్రం.. ఒకే అజెండా అని స్పష్టం చేశారు. పదేండ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. పార్లమెంట్‌లో బీజేపీని నిలదీయాల్సిన అవసరం ఉందని చెప్పారు. పదేండ్లలో యావత్ తెలంగాణను బీజేపీ మోసీ చేసిందన్నారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే ప్రతిపక్ష పాత్ర పోషించి నిధులు తీసుకొస్తాని చెప్పారు. సంకిర్ణ ప్రభుత్వం వస్తే కారు పార్టీదేపై చేయిగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీని బలిపశువు చేయాలి అనుకొని వల్లే బలయ్యారని విమర్శించారు. కొత్త జిల్లాలను రద్దు చేయాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు.

## అభివృద్ధిలో భారత్ ముందంజ

పెద్దపల్లి, ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ నంబర్ వన్ అవుతుందని భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఫార్మా, పెట్రో కెమికల్స్ రంగాల్లో దేశం రెండో స్థానంలో ఉందని తెలిపారు. పెద్దపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. గతంలో మొబైళ్లు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే వాళ్లమని గుర్తుచేశారు. ప్రస్తుతం మేడిన్ ఇండియా ఫోన్లు వాడుతున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానంలో ఉందని చెప్పారు. దేశంలో 56 వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించినట్లు నడ్డా వివరించారు. 52 వేల కిలోమీటర్ల మేర రైల్వే విద్యుదీకరణ చేసినట్లు తెలిపారు. 'దేశంలో విమానాశ్రయాల సంఖ్య 148కి పెంచాం. లక్షలాది గ్రామాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాం. 80 కోట్ల మంది పేదలకు ఉచిత రేషన్ అందిస్తున్నాం. పేదలకు 4 కోట్ల ఇళ్లు కట్టించాం. మోదీ హయాంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. రాష్ట్రానికి వందేభారత్ రైలు సేవలు అందించాం. రెండు పడక గదుల ఇళ్ల పేరుతో కేసీఆర్ మోసగించారు. కేసీఆర్ హామీ ఇచ్చిన 2 పడక గదుల ఇళ్లు మేం పూర్తి చేస్తాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజనను కేసీఆర్ ఉపయోగించుకోలేదు. ఇప్పుడు పీఎంఏవై పథకాన్ని రేవంత్‌రెడ్డి కూడా ఉపయోగించుకోవట్లేదు' అని జేపీ నడ్డా విమర్శించారు.కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మతపరమైన రిజర్వేషన్ల కారణంగా ఓబీసీలకు అన్యాయం జరుగుతోందని జేపీ నడ్డా అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మతపరమైన రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పారు. మోదీ రిజర్వేషన్లు రద్దు చేస్తారని రాహుల్ గాంధీ చెబుతున్నారని, అధి సరికాదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం చేసే విధంగా బీజేపీ పనిచేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సనాతన ధర్మానికి వ్యతిరేకమైన పార్టీ విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక నిజాయితీతో కూడిన పాలన అందిస్తున్నామని చెప్పారు. అభివృద్ధిలో దేశాన్ని ఐదో స్థానంలో నిలిపిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇండ్లు నిర్మించామని అన్నారు. రానున్న ఐదేళ్లలో మరో 3 కోట్ల ఇండ్లు నిర్మించడానికి ప్రణాళికలు రెడీ చేశామని చెప్పారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనకు అంగీకరించలేదని, ఇప్పటి రేవంత్ రెడ్డి సర్కారు కూడా యాక్సెప్ట్ చేయడం లేదని అన్నారు. తెలంగాణకు మూడు వందే భారత్ రైళ్లు ఇచ్చామని అన్నారు. పెద్దపల్లికి లాభం చేకూర్చేలా నిజామాబాద్ నుంచి పెద్దపల్లి మీదుగా ఇండోర్ కు రైలును ప్రారంభించనున్నామని నడ్డా చెప్పారు.

## పలువురు పోలీస్ అధికారుల బదిలీ

అనంతపురం, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాలోని పలువురు అధికారులపై ఎన్నికల సంఘం బదిలీ వేటు కొనసాగుతోంది. ఇటీవల ఎస్పీ అన్బురాజన్‌ను బదిలీ చేసిన ఈసీ.. తాజాగా అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిపై వేటు వేసింది. తక్షణమే విధుల నుంచి రిలీవ్ కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు ఎన్నికల బాధ్యతలు అప్పగించొద్దని ఉన్నతాధికారులను ఆదేశించింది. వైకాపాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ విపక్షాల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈసీ చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. వైకాపాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో

# ఎనుక ఎనుకనే ఎర్రజెండా! ఏపీలో తప్పని అగచాట్లు

విజయవాడ :ఎర్రజెండా ఏ ఊళ్లో ఎగిరినా అక్కడ కార్మిక, కర్షక వర్గానికి మేలు జరగుతుంది.. పేదల పక్షపాతిగా జనం గుండెల్లో ఎన్నో ఏండ్లుగా ఎర్రజెండా రెపరెపలాడింది. అయితే ఇదంతా గతం.. ఇప్పుడు ఎర్రజెండా కొన్ని పార్టీల ఎనక ఎనకనే తిరుగుతూ పబ్బం గడుపుకునే స్థితికి చేరింది. దీనికి చాలా కారణాలున్నాయి. మారుతన్న సామాజిక పరిస్థితులతో పాటు ఆ పార్టీ నాయకత్వం ఆలోచనా విధానం మారకపోవడం.. నేటికీ కూలీ, కార్మిక పోరాటాలంటూ మూస ధోరణి అవలంబించడం కూడా కారణం అనే వాదనలున్నాయి. దీంతో ఇతర పార్టీలకు తోక పార్టీగా కమ్యూనిస్టులు మిగిలిపోయారు. కాగా, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఏపీ, తెలంగాణలో కమ్యూనిస్టులు లాల్ సలామ్ వరకే పరిమితమయ్యారు. వారిని మాత్రం జనం పట్టించుకోవడం లేదన్నది స్పష్టంగా తెలుస్తోంది. దీంతో లెఫ్ట్ పార్టీల లీడర్లు కాస్తా.. రైట్ రైట్ అంటూ ముందుకూ వెనక్కి ఊగిసలాడుతున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఊరూరా ఎగిరి.. రెపరెలాడిన ఎర్ర జెండా.. ప్రస్తత పరిస్థితుల్లో ఎక్కడా కనిపించడం లేదు. ఒకప్పుడు పసుపు దండుతో జత కట్టి చెలరేగిన వామపక్షవాదులు.. ప్రస్తుతం దైన్య స్థితిలో కాంగ్రెస్‌తో మిత్రలాభం అంటూ పోరాటం చేస్తున్నారు. 1985 నుంచి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సరళి పరిశీలిస్తే.. భూర్జువా పార్టీలను వ్యతిరేకించి పేదల పార్టీగా పేరొందిన సీపీఐ, సీపీఎం చివరికి కమ్యూనిస్టు పార్టీలు కాదు.. కమర్షియలిస్టు పార్టీలనే అపవాదును మూటగట్టుకున్నాయి. కేవలం ఇది ఆరోపణ కానే కాదు. 2023 ఎన్నికల్లో ఒక సీటు పొత్తుతో తెలంగాణలో సీపీఐ అభ్యర్థి విజయంసాధిస్తే.. ఇక ఏపీలోనూ కాంగ్రెస్‌తోనే పునర్జీవనానికి 2024 ఎన్నికల్లో సీపీఐ జట్టు కట్టింది.

ప్రశ్నించే స్థాయి నుంచి.. అసెంబ్లీలో చోటు కోల్పోయే స్థాయికి

తెలంగాణలో ఒక సీటు కూడా రానందుకు అసెంబ్లీలో అడుగుపెట్టలేక పోయామనే అంతర్మథనంతో ఏపీలో కాంగ్రెస్ తాయిలం కోసం సీపీఎం కూడా అంగీకరించక తప్పలేదు. ప్రస్తుతం ఈ ఎర్రజెండా పార్టీలు చెరికో ఎంపీ సీటు, చెరో ఎనిమిది అసెంబ్లీ సీట్లు తీసుకున్నాయి. ఐతే, ఇక్కడ అగ్రనాయకత్వం పోటీలో కనపడటం లేదు. జిల్లాల్లో కాస్తో కూస్తో జనం మధ్య తిరిగే నాయకులకే టిక్కెట్లు ఇచ్చి.. అగ్రనాయకులు ప్రచార యజ్ఞంలో నిమగ్నమ్యారు. అంటే.. తమ అభ్యర్థులను గెలిపించటానికా? లేక ఓడిపోయే సీట్లల్లో పోటీ దేనికనా? అని ప్రశ్నిస్తే.. లాల్ సలామ్ అనే నినాదమే వినిస్తోంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీల రైట్ ..రైట్ అనే పరిస్థితి కనిపిస్తోంది.దేశ రాజకీయాల్లో ఎన్డీఏ దూకుడు కనిపిస్తోంది. రామనాదం.. దేశభక్తి గానంతో బీజేపీ ఉరుకులు పరుగులు పెడుతోంది. ఇక లౌకిక శక్తులు జత కలవక పోతే దేశంలో మతోన్మాదం పెచ్చురిల్లే అవకాశం ఉందనేది వామపక్ష పార్టీలు సహా లౌకిక వాదుల ఆలోచన. అందుకే ఇండియా కూటమి ఆవర్భవించింది. కాంగ్రెస్ , సీపీఐ, సీపీఎం సహా లౌకిక పార్టీలు జత కలిశాయి. కానీ, ఈ కలయిక ఏపీలోని లెఫ్ట్ పార్టీలను ఇరుకున పెట్టాయి. కాంగ్రెస్‌తో కలిసి పయనిస్తే జనం ఏ రీతిలో తమను చేరదీస్తారో అంతుబట్టని అంశం. అధికారంపై అత్యాశతోనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ముక్కలు చేసిందనే భావన జనంలో ఇంకా తగ్గలేదు. ఒక రకంగా కాంగ్రెస్ పార్టీ అంపశయ్యపై కోమా దశలో ఉంటే.. ప్రభుత్వంపై వ్యతిరేకతతో రగిలిపోతున్న జనాన్ని ఆకర్షించేందుకు కాంగ్రెస్ పార్టీ .. దివంగత నేత వైఎస్సార్ తనయను రంగంలోకి దించింది. ప్రస్తుతం గెలుపు సంగతేమో గానీ.. ప్రభుత్వ చర్యలపై విసిగిన జనం ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తున్నారు. ఇక రాష్ట్రాన్ని విభజించాలని సీపీఐ కోరింది. అందుకే ఈ పార్టీపై జనంలో ఆగ్రహం తగ్గటం లేదు. పోలవరం నిర్వాసితులు, విశాఖ ఉక్కు సమస్యలపై పోరాడినా జనంలో నమ్మకం కలగటం లేదు. సీపీఐ నిర్ణయాలను వ్యతిరేకించటమే సీపీఎం లక్ష్యం, అందుకే రాష్ట్ర విభజనను వ్యతిరేకించినా.. సీపీఎంను జనం నమ్మలేదు. అంటే కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఈ మూడు పార్టీలపై ఏపీ జనంలో సానుకూల ప్రభావం కనిపించటం లేదనేది రాజకీయ వర్గాల విశ్లేషణ.

రాజకీయాల్లో లెఫ్ట్.. లెఫ్ట్ ఇలా..

ఎన్టీఆర్ సర్కారును 1984లో కాంగ్రెస్ పార్టీ కూల్చివేయటంతో.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఏపీలో వామపక్షాలు ఉద్యమించాయి. ఎన్టీఆర్ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచాయి.1983 ఎన్నికల్లో సీపీఐకి అయిదు సీట్లు, సీపీఎంకి నాలుగు సీట్లు వస్తే.. 1985 ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు ఉమ్మడిగా పోటీ చేయగా 11 స్థానాల్లో సీపీఐ, 11 స్థానాల్లో సీపీఎం విజయం సాధించాయి.



అసెంబ్లీలో పేదల గళం వినిపించే స్థాయికి ఎదిగాయి. కానీ ఈ రెండు పార్టీలు జాతీయ , అంతర్జాతీయ రాజకీయాల్లో మమేకమై.. ఏపీలో ప్రజల సమస్యల పరిష్కారంలో వెనుకంజ వేశాయనే అపవాదు తప్పలేదు. అంతే 1989లో సీపీఐ మూడు స్థానాలను, సీపీఎం అయిదు స్థానాలను కోల్పోయాయి. 1994లో ఎన్టీఆర్ నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీతో వామపక్షాలు జత కలవగా.. పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ (సీపీఐ 21 , సీపీఎం 16) విజయం సాధించాయి.

చంద్రబాబుతో ఫ్రెండ్‌షిప్ కట్..

1999లో సీన్ రివర్స్ అయింది. చంద్రబాబు ఆధీనంలోని తెలుగుదేశం పార్టీకి వామపక్షాలు దూరమయ్యాయి. ఇందుకు కారణం టీడీపీ బీజేపీతో చేతులు కలపటమే. సీపీఎం 48 స్థానాల్లో, సీపీఐ 45 స్థానాల్లో ఉమ్మడిగా పోటీ చేశాయి. ఈ ఎన్నికల్లో సీపీఎం కేవలం రెండు స్థానాల్లోనే గెలిచింది. 2004లో వామపక్షాలు యూపీఏ జత కలిశాయి. ఈ ఎన్నికల్లో సీపీఎం 14 స్థానాలు, సీపీఐ 12 స్థానాల్లో పోటీ చేశాయి. సీపీఎం 9 , సీపీఐ 6 స్థానాల్లో గెలిచాయి. 2009 లో టీడీపీ, టీఆర్ఎస్సహా మహా కూటమిలో సీపీఎం 18స్థానాలు, సీపీఐ 14 స్థానాల్లో పోటీ చేస్తే సీపీఎం 4 స్థానాల్లో, సీపీఐ ఒక స్థానంలో గెలిచాయి. రాష్ట్ర విభజనతో వామపక్షాల కథ బలహీన పడింది. 2014లో సీపీఐ. సీపీఎం విడివిడిగా పోటీ చేశాయి. సీపీఐ 68స్థానాల్లో పోటీ చేస్తే ఒక స్థానంలో పాడేరులో గిడ్డి ఈశ్వరి 26.243 ఓట్ల మెజారిటీతో గెలిచింది. 38స్థానాల్లో పోటీ చేసిన సీపీఎం ఒక స్థానంలో గెలిచింది. 2019 ఎన్నికల్లో జనసేన పొత్తుతో సీపీఐ ఏడు స్థానాల్లో.. సీపీఎం ఏడు స్థానాలో పోటీ చేసి ఓడిపోయాయి. ఇప్పుడు కాంగ్రెస్ తో కలిసి చెరికో ఒక ఎంపీ , 8 అసెంబ్లీ స్థానాలు చొప్పున ఉభయకమ్యూనిస్టులు పోటీలో ఉన్నారు.

పోటీకి దిగాలంటేనే విముఖత..

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీతో సీపీఐ, సీపీఎం జత కట్టటంతో ఏపీలోనూ ఉభయపార్టీలు చేతులు కలిపాయి. ఐతే, ఈ ఎన్నికల్లో అగ్రనాయకులెవరూ పోటీ చేయటం లేదు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ 1994లో అనంతపురం ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో టీడీపీతో పొత్తుతో ఆ సీటు లభించింది. ఇక 2014, 2019 ఎన్నికల్లోనూ ఆయన పోటీ చేసిన జాడ లేదు. విశాఖపట్నం నాయకుడు జె.సత్యనారాయణ మూర్తి, గుంటూరు నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో వీరిద్దరి జాడ లేదు. ప్రస్తుతం గుంటూరుఎంపీ అభ్యర్థిగా జంగాల అజయ్ కుమార్ , విజయవాడ వెస్ట్ అభ్యర్థిగా జీ కోటేశ్వరరావు,విశాఖపట్నం వెస్ట్అభ్యర్థిగా అత్తిలి విమల,అనంతపురం అభ్యర్థిగా జాఫర్ , పత్తికొండ అభ్యర్థిగా రామచంద్రయ్య , తిరుపతి అభ్యర్థిగా పి.మురళి , రాజంపేట అభ్యర్థిగా బూక్యా విశ్వనాథ్ నాయక్ , ఏలూరు అభ్యర్థిగా బండి వెంకటేశ్వరరావు , కమలాపురం అభ్యర్థిగా నర్రెడ్డి శివరామ రెడ్డిసీపీఐ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

సీపీఎంలోనూ అదే స్థితి

ఇక సీపీఎంలోనూ ఇదే స్థితి. గతంలో జరిగిన ఎన్నికల్లో కార్యదర్శి హోదా నాయకులు పోటీల్లో కనిపిస్తే.. ఈ ఎన్నకల్లో అగ్రనాయకులెవరూ లేరు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల్లో కొందరూ ప్రస్తుతం పోటీ చేస్తున్నారు. మంగళగిరి లో జొన్నా శివశంకరరావు, రంపచోడవరంలో లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థిగా పాచిపెంట అప్పల నర్స , నెల్లూరు సిటీలో ఆదిమూలపు రమేష్ . విజయవాడ సెంట్రల్ అభ్యర్థిగా సీహెచ్ బాబురావు, గన్నవరంలో కళ్లం వెంకటేశ్వరరావు, కురుపాంలో మండంగి రమణ , గాజువాకలో మరడాన జగ్గునాయుడు సీపీఎం అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు.

# సంక్షోభంలో ఎపి వ్యవసాయరంగం



అమరావతి, ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగం, రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో వున్నది. నీటిపారుదల రంగాన్ని తెలుగుదేశం ప్రభుత్వం, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ నిర్లక్ష్యం చేశాయి. కౌలు రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. రైతాంగ సమస్యలు పరిష్కరించాలంటే స్వామినాథన్, జయతీ ఘోష్, రాధాకృష్ణన్ కమిటీల సిఫార్సులు అమలు జరపాలి. రైతులందరికీ రుణాలు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. కౌలు రైతుల కోసం 2011లో చేసిన చట్టం గానీ, 2019లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన చట్టం గానీ ఉపయోగపడలేదు. కౌలురైతులకు భూయజమాని సంతకం వుండాలనే నిబంధన వలన రుణాలు అందటంలేదు. కౌలు రైతులందరికీ భూయజమాని తీసుకున్న రుణంతో సంబంధం లేకుండా బ్యాంకుల రుణాలు కల్పించాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధార, వెలిగొండ, హంద్రి-నీవా, గాలేరు-నగరి మొదలైన ప్రాజెక్టులతో పాటు మధ్య-చిన్న తరహా నీటి ప్రాజెక్టులను కూడా తీవ్రంగా నిర్లక్ష్యం చేశారు. ఉదాహరణకు ఇరిగేషన్‌కు బ్జడెట్‌లో గత నాలుగేళ్లలో రూ.61,573 కోట్లు కేటాయించి, రూ.32,059 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం దారుణమైన విషయం. ప్రాజెక్టుల ద్వారా జలాలను వినియోగించకుండా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి అసాధ్యం. విభజన చట్టంలో సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారు. పర్యావరణ, అటవీ, పునరావాస, పునర్నిర్మాణ అనుమతులకు కేంద్రానిదే బాధ్యత అని పేర్కొన్నారు. 2017-18 సవరించిన అంచనాల ప్రకారం మొత్తం వ్యయం రూ.55,606 కోట్లుగా అంచనా వేశారు. దీనిలో భూసేకరణకు, పునరావాసానికి రూ.33 వేల కోట్లు ప్రతిపాదించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించటం అతి పెద్ద అంశం. 373 గ్రామాలలో 1,05,000 కుటుంబాలు నిర్వాసితులుగా మారతాయి. ఇప్పటికి కేవలం 8,000 కుటుంబాలకు మాత్రమే పునరావాసం జరిగి 9 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పునరావాసం జరగకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తికాదు. పునరావాసానికి కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని విభజన చట్టం తెలుపగా, నిధులతో మాకు సంబంధంలేదని కేంద్రప్రభుత్వం వివరిస్తున్నది. ఈ వారంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిర్వాసితుల పునరావాసం కోసం రాష్ట్ర ప్రజలపై 'సెస్సు' విధిస్తామని ప్రతిపాదించడం దారుణమైన విషయం. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి న్యాయంగా రావలసిన హక్కులను సాధించుకోకుండా, ఈ రకమైన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రజల హక్కులను దెబ్బతీస్తాయి. విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' నినాదంతో అనేక త్యాగాల ద్వారా సాధించుకున్నాము. ఆనాటి ఉద్యమంలో 32 మంది మరణించి ప్రాణత్యాగం చేశారు. 64 గ్రామాలకు చెందిన రైతులు ఉక్కు కర్మాగారం కోసం 26 వేల ఎకరాలు ఇచ్చి త్యాగం చేసి, నిర్వాసితులుగా మారారు. ఇప్పుడు ఉక్కు కర్మాగారం ఆస్తుల విలువ రెండు లక్షల కోట్లకు పైగా ఉంటుంది. ఉక్కు కర్మాగారం వలన విశాఖ నగరం, గాజువాక వంటి ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఉక్కు కర్మాగారానికి స్వంత గనులు ఇవ్వకుండా, వివక్షత చూపటంతో ఉక్కు కర్మాగారం కొంత మేరకు నష్టాలు ఎదుర్కొన్నది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరిస్తామని, జిందాల్-అదానీ వంటి క్రోనీ పెట్టుబడిదారులకు అమ్మేస్తామని ప్రకటించడం దారుణమైన విషయం. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత వెయ్యి రోజులకు పైగా పెద్ద ఉద్యమం జరుగుతున్నది. వామపక్షాలు ప్రధాన పాత్ర వహించాయి. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ పట్ల, అభివృద్ధి పట్ల మూడు ప్రాంతీయ పార్టీలు స్పష్టంగా లేవు. 'సంక్షేమమే' మొత్తం అభివృద్ధి అన్న విధంగా వ్యవహరిస్తున్నాయి. వ్యక్తిగత దూషణలు, నిందలతో ఎన్నికల ప్రచారం చేస్తున్నాయి. కులతత్వాన్ని రెచ్చగొడుతున్నాయి. అదే సమయంలో 'ఇండియా' వేదికలో భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే 'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా' కల్పించే ఫైల్‌పై సంతకం చేస్తామని ప్రకటించింది. విభజన హామీలు అమలు చేస్తామని ప్రకటించలేకపోతున్నారు. ప్రజలు, ప్రజాసంఘాలు, వామపక్ష సంఘాలు, దళిత-బహుజన సంఘాలు, అభ్యుదయ వాదులు, మేధావులు అందరూ కలసి ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి కోసం జరిగే కృషిలో భాగస్వాములై, రాజకీయ

# వైకాపాది అవినీతి తంత్రం

అనకాపల్లి, వైకాపాది అవినీతి మంత్రం అయితే.. ఎన్డీయేది అభివృద్ధి మంత్రమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అనకాపల్లి జిల్లా రాజుపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో శాండ్, ల్యాండ్, మద్యం మాఫియా పాలన సాగుతోందని, ఈ దోపిడీ నుంచి విముక్తి కల్పించేందుకు ఎన్డీయే ప్రభుత్వాన్ని స్థాపించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందన్నారు. 'అనకాపల్లి నుంచి అనంతపురం వరకూ ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మించాం. రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నం వరకూ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో ఉంది. కోల్‌కతా నుంచి చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే ఈ ప్రాంతం మీదుగా వెళ్తుంది. 2014 వరకు 4వేల కి.మీ జాతీయ రహదాలు ఉంటే.. ప్రస్తుతం 8వేల కి.మీ.లకు చేరాయి. ఎన్డీయే ప్రభుత్వం ఏపీలోని యువత కోసం పనిచేస్తోంది. ట్రిపుల్ ఐటీ, ఐసర్, ఐఐఎం లాంటి జాతీయ విద్యా సంస్థలు ప్రారంభించాం. పూడిమడకలో గ్రీన్ ఎనర్జీ పార్క్ ప్రతిపాదించాం. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌కు రూ.వెయ్యి కోట్ల సాయం అందించాం. వైకాపా మంత్రం అవినీతి. ఎన్డీయే మంత్ర అభివృద్ధి. అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ఆటంకాలు కల్పిస్తోంది. విశాఖ రైల్వేజోన్ మంజూరు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం భూమి కూడా ఇవ్వడం లేదు. ఏపీ కోసం కేంద్ర అనేక కార్యక్రమాలు చేపట్టింది. పేదల కోసం 21లక్షల పీఎంఏవై గృహాలు మంజూరు చేస్తే.. వాటిలో సగం కూడా వారికి ఇవ్వలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ప్రాజెక్టులు వైకాపా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. ఈ ప్రాజెక్టులను వైయస్సాఆర్ ప్రారంభించారు. తండ్రి వారసత్వం తీసుకున్న జగన్ వాటిని పూర్తి చేయలేకపోయారు' 'అనకాపల్లి చెరకు రైతులకు పెద్ద కేంద్రం. రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల చాలా చక్కెర పరిశ్రమలు మూతపడి రైతులు ఆందోళన చెందుతున్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చాక చెరకు రైతుల జీవితాల్లో మాధుర్యం తెస్తాం. పెట్రోల్‌లో ఇథనాల్ కలపడాన్ని ప్రోత్సహిస్తున్నాం. దీంతో దాదాపు రూ.8వేల కోట్ల వరకు చెరకు రైతులు లబ్ది పొందుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వం మత్స్యకారుల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశాం. ఏపీలో కాంగ్రెస్ పోయి వైకాపా వచ్చినా మార్పులేదు. రెండూ అవినీతి పార్టీలే. పక్కనే ఉన్న కర్ణాటకలో ట్యాంకర్ మాఫియా, భూ మాఫియాతో ప్రభుత్వం నడుపుతున్నారు. ఏపీలో శాండ్, ల్యాండ్, మద్యం మాఫియాతో పాలన సాగిస్తున్నారు. ఈ దోపిడీ నుంచి ఆంధప్రదేశ్‌ను విముక్తి చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఎన్నుకోవాలి. ఏపీలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక దేవాలయాలను రక్షిస్తాం' అని మోదీ భరోసా ఇచ్చారు.

# ఎన్డీయే గెలుపును ఎవరూ ఆపలేరు

అనకాపల్లి, ఎన్డీయే గెలుపును ఎవరూ ఆపలేరని, అవినీతి వైకాపా ప్రభుత్వం ఇంటికెళ్లడం ఖాయమని తెదేపా అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. అధికారం ఉందని విర్రవీగిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. 2047లో వికసిత్ భారత్.. మోదీ లక్ష్యమైతే.. వికసిత్ ఆంధ్రప్రదేశ్.. తన లక్ష్యమన్నారు. అనకాపల్లిలోని రాజుపాలెంలో నిర్వహించిన కూటమి బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు. కూటమి మ్యానిఫెస్టో ముందు వైకాపా మ్యానిఫెస్టో వెలవెలబోయిందన్నారు. 25 లోక్‌సభ, 160 శాసనసభ సీట్లలో కూటమిదే విజయమన్నారు. పోలవరం పూర్తి చేసేందుకు, అమరావతి నిర్మాణ కోసం, తెలుగు భాషను కాపాడేందుకే మూడు పార్టీల కలయిక అని వివరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదన్నారు. ప్రజల భూముల పత్రాలపై జగన్ ఫొటో ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఎంత డబ్బు ఖర్చుపెట్టినా జగన్ ఓడిపోవడం ఖాయమన్నారు. మోదీ గ్యారంటీలు, కూటమి మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కేంద్రం సాయంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 'వైకాపా ఉత్తరాంధ్ర ద్రోహి. సాగునీటి ప్రాజెక్టుల కోసం తెదేపా హయాంలో రూ.2,500 కోట్లు ఖర్చుపెడితే, జగన్ ప్రభుత్వం కేవలం రూ. 500 కోట్లు మాత్రమే ఇచ్చింది. తెదేపా అధికారంలో ఉంటే ఇప్పటికే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ప్రాజెక్టులు పూర్తయి ఉండేవన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకొని ఇక్కడి ప్రజలకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్. అధికారంలోకి రాగానే ఇప్పుడున్న రూ.3 వేల పింఛన్‌ను రూ. 4వేలకు పెంచుతాం. ఏప్రిల్ నుంచే దానిని అమలు చేస్తాం. లబ్దిదారులకు ఇంటి వద్దే పింఛను అందిస్తాం. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ పైనే. ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు రద్దుపై రెండో సంతకం పెడతా. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల ఆర్థిక సాయం చేస్తాం' అని చంద్రబాబు ప్రకటించారు. అనకాపల్లి: ఈ ఎన్నికల్లో ఎన్డీఏ గెలుపును ఎవరూ ఆపలేరని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ ఎన్నికల్లో 160 అసెంబ్లీ, 25 లోక్‌సభ సీట్లలో కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి వైసీపీ ప్రభుత్వం ఇంటికెళ్లడం ఖాయమని హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో ఎంత డబ్బు ఖర్చుపెట్టినా జగన్ పనైపోయిందని ఎద్దేవా చేశారు. అధికారం ఉందని విర్రవీగిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. ఏపీ అభివృద్ధికి మోదీ భరోసా ఇచ్చారని అన్నారు. రాష్ట్రానికి ఇక అన్నీ మంచి రోజులేనని చెప్పుకొచ్చారు. కూటమిగా ఎందుకు ఏర్పడ్డామో.. మోదీ, అమిత్‌షా చెప్పారని అన్నారు.'జగ్గూ భాయ్ నీ బాబాయ్ (మాజీ మంత్రి వివేకానందారెడ్డిని) ఎవరు చంపారో.. ఇంకా అర్థం కాలేదా' అని చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. గతంలో విశాఖ వచ్చినప్పుడు పవన్‌ను అడ్డుకున్నారని చెప్పారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను అవమానించి.. వ్యక్తిగత విమర్శలు చేశారని విరుచుకుపడ్డారు. తాను జైలులో ఉన్నప్పుడు పవన్ వచ్చి పరామర్శించారని తెలిపారు. నిజజీవితంలోనూ పవన్‌కల్యాణ్ హీరోనేనని కొనియాడారు. ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలవాలని పవన్ చెప్పారన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మా కలయిక.. అమరావతి నిర్మాణం కోసమని తెలిపారు. మా కలయిక.. తెలుగు భాషను కాపాడుకునేందుకేనని చెప్పారు.మా కలయిక.. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేసేందుకేనని తెలిపారు. మీ భూముల పత్రాలపై జగన్ ఫొటో ఎందుకు? అని చంద్రబాబు ప్రశ్నించారు.

## టూ వీలర్ దొంగల ముఠా పట్టివేత

హైదరాబాద్,నగరంలోని మోటర్ సైకిల్లను దొంగతనం చేసే ముఠాను పట్టుకున్నారు పోలీసులు. సోమవారం నాడు మోటార్‌సైకిల్ చోరీకి పాల్పడుతున్న సమయంలో ఇద్దర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు శ్యాంస్ బిలాల్, రాసూరి సుకేశ్వర్ అలియాస్ లోకేష్ గా గుర్తించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కే శ్రీనివాస రెడ్డి స్పందిస్తూ విలాసవంతమైన జీవనశైలికి అలవాటుపడి నగరంలో బైక్‌లు, స్కూటర్లను దొంగిలిస్తున్నారని తెలిపారు.స్వాధీనం చేసుకున్న వాహనాలు మధురానగర్, ఖైరతాబాద్, మీర్‌పేట్, రాజేంద్రనగర్, హుమయూన్‌నగర్, పటాన్‌చెరువు, గుడిమల్కాపూర్, అబిద్ రోడ్, సరూర్‌నగర్, చాంద్రాయణగుట్ట, హుమాయూన్‌నగర్‌తో సహా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీకి గురైనట్లు తెలిపారు.

# ఓట్ల కోసం హిందువులను బీజేపీ భయపెడుతున్నదా?




హైదరాబాద్,మోదీ ప్రభుత్వం వచ్చాక ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తిగా భారత్ ఎదిగిందని బీజేపీ నేతలు గొప్పగా చెప్పుకొన్నారు. దీనికి ప్రధాని నాయకత్వమే కారణమని కీర్తించారు. మరోసారి అధికారంలోకి వస్తే దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, కనుక బలమైన నేత అయిన మోదీకే పట్టం కట్టాలని ఎన్నికల ముందు వరకు ఊదరగొట్టారు. రెండు దశల పోలింగ్ ముగిసి గతం కంటే తక్కువ పోలింగ్ నమోదు కావడంతోపాటు, ప్రధాని సహా ఆ పార్టీ నేతలు చేస్తున్న భావోద్వేగ ప్రచారానికి ప్రజలు పెద్దగా స్పందించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వీటిని బేరీజు వేసుకున్న తర్వాత ఈసారి ఫలితాలు ఆశాజనకంగా ఉండవనే అంచనాకు కమలనాథులు వచ్చి ఉంటారన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతున్నది. అందుకే రాహుల్‌గాంధీని ప్రధాని చేయడానికి దాయాది దేశం పాకిస్థాన్ తహతహలాడుతున్నదని కొత్త పాట మొదలుపెట్టారని అంటున్నారు.

ప్రధాని స్థాయికి తగునా?

నిజానికి పాకిస్థాన్ తన ఆర్థిక, రాజకీయ సంక్షోభాలను చక్కదిద్దుకునే పరిస్థితిలో లేదు. ఇలాంటి స్థితిలో భారతదేశ ఎన్నికల రాజకీయాలను పాకిస్తాన్ శాసిస్తుందనే విధంగా మోదీ మాట్లాడటం.. ఆయనలోని ఆందోళనకు అద్దంపడుతున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జార?ండ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మాట్లాడుతూ.. 'గతంలో ఉగ్రదాడుల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని పిరికి ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై పెడబొబ్బలు పెట్టేది. కానీ ఇప్పుడు ఆ రోజులు పోయాయి. మన సర్జికల్ స్ట్రైక్స్‌తో అల్లాడిపోయిన దాయాది దేశం సహాయం కోసం ఏడుస్తూ కేకలు పెడుతున్నది. అది మా ప్రభుత్వం ఘనత' అని గొప్పగా చెప్పుకొనే ప్రయత్నం చేశారు.అలాంటి ప్రధాని భారతదేశాన్ని తక్కువ చేసే విధంగా గతంలో ఏ ప్రధాని చేయని విధంగా పాకిస్థాన్ లాంటి దేశం భారత దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నదని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సంకీర్ణ ప్రభుత్వాల వల్ల కేంద్రంలోని ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతున్నదని భావించి బీజేపీకి సంపూర్ణ మెజారిటీ కట్టబెట్టారు. రెండోసారి అంతేకంటే ఎక్కువ మెజారిటీ ఇచ్చారు. కానీ ప్రజలు నమ్మకాలను మోదీ వమ్ము చేశారనే వాదనలున్నాయి. అవి నిజమే అన్నట్టు బీజేపీ నేతల వ్యాఖ్యలుంటున్నాయి. ఆ పార్టీ నేతల వ్యాఖ్యలు చూసి జనాలకు విసుగు వస్తున్నదంటే అతిశయోక్తి కాదు.పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ ప్రజలకు ఏం చేశామో చెప్పకుండా ఇంకా సాధారణ ఎన్నికలు మొదలు ఉప ఎన్నికల వరకు పాకిస్థాన్ జపం చేసి, జనాలను రెచ్చగొట్టేలా ప్రధాని సహా ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తుంటారంటే వాళ్లు పదేళ్లలో చేసింది ఏమీ చేయలేదని పరోక్షంగా అంగీకరించినట్టేనని విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో జిజియా పన్ను (వారసత్వ సంపదప పన్ను), గోవధ గురించి ప్రస్తావించింది. ఇది మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు క్రూర పాలనను తలపింపజేస్తున్నదని యూపీ సీఎం ఆదిత్యనాథ్ ఆరోపించారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి తమ హయాంలో శాంతిభద్రతలను కాపాడటానికి బుల్డోజర్ల అవసరం రాలేదని ఆదిత్యనాథ్ పరిపాలనపై నాలుగు రోజుల కిందట సెటైర్ వేసింది ఇందుకోసమే కదా!

పాకిస్థాన్, గోధ్రా ప్రస్తావన వెనుక!

బీహార్, జార?ండ్ సభల్లో ప్రధాని మోదీ 2002 నాటి గోధ్రా రైలు దమనకాండ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని పలువురు విశ్లేషకులు అంటున్నారు. నాటి ఘటనకు బాధ్యత వహించి మోదీ రాజీనామా చేయాలని నాటి ప్రధాని వాజపేయి అన్నది నిజం కాదా? ఇదే మోదీకి వాజపేయి రాజధర్మాన్ని బోధించింది వాస్తవం కాదా? ఇంకా మతం, పాకిస్థాన్ అంశాల ఆధారంగానే ఓట్లు అడుక్కునే స్థితికి బీజేపీ దిగజారడటం దేనికి సంకేతం? అని వారు ప్రశ్నిస్తున్నారు. సంపూర్ణ మెజారిటీ ఇచ్చిన మోదీ ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో ఏం చేసిందో తెలుసు. మొదటి రెండు దశల పోలింగ్ తర్వాత మూడ్ ఆఫ్ నేషన్ ఈసారి అధికారపార్టీకి వ్యతిరేకంగా ఉంటుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ శశి థరూర్ పీటీఐ వార్తా సంస్థ సంపాదకులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్నది సంకీర్ణ ప్రభుత్వమే అన్నారు. అంతేకాదు సంకీర్ణ ప్రభుత్వంపై ప్రజలెవరూ భయపడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. అలాంటి ప్రభుత్వాలు ఏర్పడితే ప్రధాని పదవిని ఎవరు చేపట్టినా నిరంకుశ నిర్ణయాలు ఉండవన్నారు. సంకీర్ణ సర్కారుల హయాంలోనే దేశ ఆర్థిక వృద్ధి మెరుగ్గా ఉందన్నారు. దీనికి మాజీ ప్రధానులు వాజపేయి, మన్మోహన్ నేతృత్వంలోని ప్రభుత్వాల పాలనను, నిర్ణయాలను ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఇవి ఆలోచించే విధంగా ఉన్నాయి.

ప్రజలు కోరుకుంటున్నదేంటి?

ఎందుకంటే మోదీ ప్రభుత్వం రెండుసార్లు సంపూర్ణ మెజారిటీ ఇస్తే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది. అన్ని రాష్ట్రాల, ప్రజల అభిప్రాయలను పరిగణనలోకి తీసుకోకుండా సీఏఏను అమలు చేస్తామని ప్రకటించింది. ఒక ముస్లింలకు తప్పా ఇతర దేశాల్లోని ఇతర మతాల వారికి పౌరసత్వం ఇస్తామని చెబుతున్నది. ఇదంతా ముస్లింలను బూచిగా చూపెట్టి హిందువులను భయపెట్టి ఓట్లు రాబట్టుకునే ఎత్తుగడగా కనిపిస్తున్నదని చెబుతున్నారు. ప్రజలు కోరుకుంటున్నది ఇది కాదని, పారదర్శకమైన, చట్టబద్ధమైన పాలనను మాత్రమే అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అందుకే రెండుసార్లు సంపూర్ణ మెజారిటీ ఇచ్చి సమస్యలను కోరితెచ్చుకున్న ప్రజలు ఈసారి మార్పు కోరుకుంటున్నట్టు తెలుస్తోందని వారు అంచనా వేస్తున్నారు.

# హైదరాబాద్‌లో అర్బన్ హీట్ ఐలాండ్స్



హైదరాబాద్,తెలంగాణలో గత కొన్నిరోజులుగా భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తుండటంతో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ నెల తొలి వారంలోనే 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లోనూ సూర్యుడు సుర్రుమంటుడటంతో వేడికి తాళలేక జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల తర్వాత ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.మధ్యాహ్నం 12 తర్వాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. గతంలో తకువ ఉష్ణోగ్రతలు నమోదైన హైదరాబాద్‌లో క్రమంగా 'హీట్ ఐలాండ్స్' పుట్టుకొస్తున్నాయి. 'హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్' అనే స్వచ్ఛంద సంస్థ జరిపిన పరిశోధనలో ఇవి బయటపడ్డాయి. ఈ సంస్థకు చెందిన పరిశోధకులు శబరినాథ్, మేఘన ఈ ఏడాది మార్చిలో నమోదైన ఉష్ణోగ్రతలను లెకించి హీట్‌ఇండెక్స్‌ను రూపొందించారు.ల్యాండ్ సర్ఫేస్ టెంపరేచర్లను (భూమి ఉపరితలంపై 2-3 మీటర్ల ఎత్తులో నమోదయ్యే ఉష్ణోగ్రతలను) లెకించడం ద్వారా అర్బన్ హీట్ ఐలాండ్స్‌ను గుర్తించారు. ల్యాండ్ శాట్ శాటిలైట్ డాటా ఆధారంగా ఉష్ణోగ్రతలను లెకించి, వేడిమి అధికంగా ఉన్న 7 ప్రాంతాలను గూగుల్ ఎర్త్ ఇంజిన్ ద్వారా మార్ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి, బీఎన్‌రెడ్డి నగర్, మన్సూరాబాద్, పటాన్‌చెరు, బండ్లగూడ, గచ్చిబౌలి, హయత్‌నగర్ ప్రాంతాలు హీట్ ఐలాండ్స్‌గా మారినట్టు గుర్తించారు. ఆ ప్రాంతాల్లో ల్యాండ్ సర్ఫేస్ టెంపరేచర్లు 48 నుంచి 49 సెల్సియస్ డిగ్రీల మేరకు నమోదవుతున్నట్టు వెల్లడించారు. వాతావరణ కాలుష్యంతోపాటు కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం, చెట్లను నరికివేయడం ఇందుకు ప్రధాన కారణమని తేల్చారు. ఇండ్లలో వాడుతున్న ఏసీలు, ఫ్రిజ్‌ల వల్ల కూడా సర్ఫేస్ టెంపరేచర్లు పెరిగి హీట్ ఐలాండ్స్ పుట్టుకొస్తున్నట్టు తెలిపారు.

# అవినాశ్ లాగా గొడ్డలి రాజకీయాలు రావు




కడప,అవినాష్ మాదిరిగా అర్ధరాత్రి గొడ్డలి రాజకీయాలు తమకు తెలియదని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల మండిపడ్డారు. జగన్ ను చూసుకునే తెలంగాణ నేత రాఘవరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రూ.వెయ్యి కోట్లు తీసుకున్నట్లు రుజువులు ఉంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 'ఒకసారి ఆలోచన చేయండి. ఇదే జగన్ మోహన్ రెడ్డి వివేకా హత్య తర్వాత సిబిఐ విచారణ అడిగారు. సీఎం అయ్యాక విచారణ వద్దు అన్నారు. అప్పుడొక మాట... ఇప్పుడొక మాట. వైఎస్ పేరును ఛార్జ్ షీట్ లో పెట్టించారు. పొన్నవోలుకి అడ్వకేట్ జనరల్ పదవి ఇచ్చారు. సొంత తండ్రి పేరు ఛార్జ్ షీట్ లో చేర్పించిన ఘనత జగన్ ది. నా భర్త అనిల్ పై అవినాష్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ల్యాండ్ క్రూజర్ లో వెళ్లి కలిశాడట. నా భర్తకు ఏ ఇంటికి వెళ్లాల్సిన అవసరం లేదు.' అని షర్మిల వ్యాఖ్యానించారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును సీబీఐ ఛార్జిషీట్‌లో పెట్టించిన వారికి ఏఏజీ పదవి ఇచ్చారనివైఎస్ షర్మిల ఆరోపించారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. వివేకా హత్య కేసుపై మాట్లాడుతూ జగన్ అధికారంలో లేనప్పుడు సీబీఐ విచారణ కావాలని అడిగారని గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే ఎందుకు వద్దన్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్‌ను చూసుకునే తెలంగాణ నేత రాఘవరెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రూ.వెయ్యి కోట్లు తీసుకున్నట్లు రుజువులు ఉంటే బయటపెట్టాలన్నారు. ఇటీవల కడప ఎంపీ అవినాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల పైనా షర్మిల స్పందించారు. తన భర్త అనిల్ కుమార్ భాజపా నేతను ఎక్కడా కలవలేదు.. కలవరని చెప్పారు. అవినాష్ మాదిరి అర్ధరాత్రి గొడ్డలి రాజకీయాలు తమకు తెలియదని ఎద్దేవా చేశారు. 'కంటికి కనిపించని పొత్తును జగన్ కొనసాగిస్తున్నారు. క్రైస్తవులపై దాడి ఘటనలో కూడా వైకాపా స్పందించలేదు. అదానీ, అంబానీలకు ప్రభుత్వ ఆస్తులను సీఎం దోచిపెట్టారు. జగన్ భాజపా దత్తపుత్రుడని నిర్మలా సీతారామన్ చెప్పారు. మోదీ వారసుడిగానే ఆయన ఉన్నారు.. వైఎస్సార్ వారసుడిగా కాదు. వైకాపా ఇంత అవినీతిలో కూరుకుపోయినా భాజపా ఎందుకు చర్యలు తీసుకోలేదు?. జగన్ ఆ పార్టీకి దత్తపుత్రుడు, తొత్తు కాబట్టే చర్యలు తీసుకోలేదు' అని షర్మిల విమర్శించారు. తాను సీఎం జగన్ ను పని కావాలని అడిగినట్లు కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని షర్మిల మండిపడ్డారు. తాను రూ.వెయ్యి కోట్ల పని అడిగానని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. అలా మాట్లాడేవాళ్లు జగన్ పడేసే బిస్కెట్లకు ఆశ పడే వాళ్లే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ముందు ఇలా మాట్లాడుతున్నందుకు మీకు ఎంత అందుతున్నాయో చెప్పండి.? అంటూ నిలదీశారు. 'రూ.వెయ్యి కోట్లు ఏంటి రూ.10 వేల కోట్ల వర్క్ అడిగాను అని కూడా చెప్తారు. నేను ఒక్క పైసా సహాయం అడగలేదు. అలా అడిగానని నిరూపిస్తే రాజకీయాలు వదిలి వెళ్లిపోతా. వీళ్లు ఊసరవెల్లులు. అవసరానికి వాడుకుంటారు. అవసరం తీరాక పుట్టుకనే అవమానిస్తారు. నా తల్లి విజయమ్మపై సైతం నిందలు వేశారు.' అంటూ వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఒక ట్రయాంగిల్ లవ్ స్టోరీ నడుస్తుందని.. చంద్రబాబు, జగన్ ఇద్దరూ మోదీని పట్టుకుని వేలాడుతున్నారని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఒకరు పొత్తు.. ఒకరు తొత్తు. ఇద్దరూ రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెట్టారు. ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్ ను తాకట్టు పెట్టారు. రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరుస్తారని జగన్ కి ఓటేస్తే కుచ్చుటోపీ పెట్టారు. సొంత చిన్నాన్న వివేకా హత్య కేసు నిందితుడికి మళ్లీ పట్టం కట్టారు. వివేకా బిడ్డ ఈనాటికీ న్యాయం కోసం పోరాటం చేస్తోంది. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి హంతకుడిని కాపాడుతుంటే ఇక ప్రజల పరిస్థితి ఏంటి?. వైఎస్ఆర్ బిడ్డ ఇవాళ నిలబడింది వివేకా ఆఖరి కోరిక నెరవేర్చాలని. న్యాయం కోసం ప్రజా కోర్టులో తేల్చుకోవాలని పోటీ చేస్తున్నా. కడప ప్రజలు న్యాయంవైపు నిలబడాలని కోరుతున్నా. వైఎస్ఆర్ బిడ్డగా మాటిస్తున్నా. మీ ఇంట్లో బిడ్డను అవుతాను.' అంటూ షర్మిల వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో లెఫ్ట్ నేతలు కూడా పాల్గొన్నారు.

# మోదీ గుండెలో బండికి ప్రత్యేక స్థానం..

కరీంనగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుండెలో బండి సంజయ్ కుమార్‌కు ప్రత్యేక స్థానం ఉందని తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు అన్నామలై అన్నారు. దక్షిణ భారత దేశంలో బీజేపీని బలోపేతం చేసేందుకు బండి సంజయ్ కు జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారని చెప్పారు. బండి సంజయ్ చేసిన పోరాటాలు దేశానికే ఆదర్శమయ్యాయన్నారు. సంజయ్ పాదయాత్ర స్ఫూర్తితోనే తమిళనాడులో తాను పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి లాఠీలు, కేసులకు భయపడకుండా జైలుకు వెళ్లిన చరిత్ర సంజయ్ కే సొంతమన్నారు.బండి సంజయ్ గెలిస్తే సామాన్యుడు గెలిచినట్లేనన్నారు. మొత్తం పోలైన ఓట్లలో 60 శాతం ఓట్లు బండి సంజయ్ కే పడేలా ఇంటింటికీ తిరిగి గెలిపించాలని యువతకు పిలుపునిచ్చారు. జమ్మికుంటలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ సమ్మేళనానికి బండి సంజయ్ తోపాటు తమిళనాడు రాష్ట్ర అధ్యక్షులు అన్నామలై, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, ప్రతాపరామక్రిష్ణ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ బండి సంజయ్ యూత్ ఐకాన్%ఠ% అందుకే బండి సంజయ్ అందుకే ఆయనకు చారిత్రాత్మక విజయాన్ని కరీంనగర్ ప్రజలు అందించబోతున్నారనే నమ్మకం తనకు ఉందన్నారు. కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు కూడా తీసుకువచ్చి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. దేశంలో రైతులు, యువత, మహిళలు, విద్యార్థుల వ్యతిరేకి ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ మాత్రమే అన్నారు. మోదీ కోసం పార్టీ కార్యకర్తలు 5 రోజులు కష్టపడండి%ఠ% మోదీ మీకోసం 5 ఏళ్లు కష్టపడి సేవ చేస్తారని తెలిపారు.బండి సంజయ్ మాట్లాడుతూ తాము పువ్వు గుర్తుపై ఓటేయాలని తిరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం గాడిద గుడ్డు గుర్తు పట్టుకుని తిరుగుతున్నరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కు ఓటేయాలనుకునే వాళ్లు బ్యాలెట్ లో గాడిద గుడ్డు గుర్తు ఉంటేనే ఓటేయ్యాలన్నారు. మోదీపై విషం చిమ్ముతున్న కాంగ్రెస్ నాయకులను చూసి జనం నవ్వుకుంటున్నరని, వారు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా కాంగ్రెస్ గ్రాఫ్ పెరగడం లేదు. కరీంనగర్ లో ఆ పార్టీ 3వ స్థానానికే పరిమితం అవుతుందని తెలిపారు.



# ఆ 30 మంది కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి వెళ్లమని చెప్పింది నేనే




హైదరాబాద్: బిఆర్ఎస్ ఎంఎల్ఏ మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశాడు. వివిధ మున్సిపల్ కార్పొరేషన్లు చెందిన 30 మంది కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి వెళ్లమని తానే చెప్పానని తెలిపారు. న్యూబోయిన్‌పల్లిలోని సౌజన్యకాలనీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే అక్కడ జరుగుతున్న విషయాలను తనకు తెలియజేయాలని కార్పొరేటర్లకు చెప్పానని వివరించారు. తాము కాంగ్రెస్ పార్టీలో ఉండలేకపోతున్నామని, సీనియర్ నాయకులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తరుచూ తనకు ఫోన్లు చేస్తున్నారని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే కాంగ్రెస్‌లోనే ఉంటూ బిఆర్ఎస్ గెలుపు కోసం పని చేయాలని ఆ కార్పొరేటర్లకు తాను సూచించానని మల్లారెడ్డి తెలియజేశారు. పార్లమెంటు ఎన్నికల తరువాత ఆ కార్పొరేటర్లు బిఆర్ఎస్‌లో చేరుతారని మల్లారెడ్డి వెల్లడించారు.కాంట్రవర్సీరీకి కేరాఫ్ అడ్రస్ మల్లారెడ్డి. ఆయన ఏది చేసినా హల్ చల్ గా ఉంటుంది. ప్రతిపక్షం లేదా ప్రభుత్వంలో ఉన్న ఆయన జోష్ గా మాట్లాడుతారు. గతంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను బిఆర్ఎస్ ఎంఎల్ఏ మల్లారెడ్డి కలిశారు. ఇద్దరికి పరిచయం ఉండడంతో అప్యాయంగా పలకరించుకున్నారు. మల్కాజ్‌గిరి నుంచి పక్కగా ఈటెల గెలుస్తారని చెప్పడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బిఆర్ఎస్ పార్టీ ఇరకాటంలో పడింది. బిఆర్ఎస్ అధిష్టానం మల్లారెడ్డి వివరణ ఇవ్వాలని అదేశించింది. దీంతో బాగా తెలిసిన వ్యక్తి కావడంతో నవ్వుకుంటా మాత్రమే ఈటలతో గెలుస్తావని చెప్పానని తెలియజేశారు. తాను చెప్పగానే ఈటల గెలుస్తారా? అని సోషల్ మీడియాకు చురకలంటించారు. పక్కగా బిఆర్ఎస్ అభ్యర్థి రాగడి లక్ష్మారెడ్డి విజయం ఖాయమన్నారు.

## ఆస్ట్రేలియాలో గాయపడ్డ విద్యార్థి మృతి

చండీగఢ్,ఆస్ట్రేలియాలో కత్తి పోట్లకు గురైన భారత విద్యార్థి నవ్‌జీత్ సంధు మృతి చెందారు. భారత విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో అతడు ప్రాణాలు కోల్పోయాడని మృతుడి బంధువు యష్‌వీర్ వెల్లడించారు. మెల్‌బోర్న్‌లో శనివారం రాత్రి జరిగిన ఘటనలో మరో విద్యార్థి గాయాల పాలయ్యారు.అద్దె విషయంలో భారత్‌కు చెందిన కొందరు విద్యార్థులు ఘర్షణ పడుతుండగా.. వారిని ఆపేందుకు వెళ్లి నవ్‌జీత్ ప్రాణాలు కోల్పోయాడని యష్‌వీర్ తెలిపారు. 'తాను ఉంటున్న ఇంటినుంచి వస్తువులు తెచ్చుకునేందుకు వెంట రావాలని సంధును అతడి స్నేహితుడు అడిగాడు. దాంతో ఇద్దరూ కలిసివెళ్లారు. తన స్నేహితుడు ఇంటి లోపలికి వెళ్లిన తర్వాత పెద్ద కేకలు వినిపించాయి. వారిమధ్య గొడవ జరుగుతుందని అర్థమై.. సంధు కూడా లోపలికి వెళ్లాడు.

# మోడీ అమిత్ షా : ఏపీలో ఆ మాటెత్తలేదెందుకో...!?

హైదరాబాద్,దేశంలో గత కొద్ది రోజులుగా ప్రధాని నరేంద్ర మోడీ హెూంమంత్రి అమిత్ షా ఒకే ఒక మాట తారకమంత్రంగా మాట్లాడుతూ వస్తున్నారు. అదే మైనారిటీలకు రిజర్వేషన్లు రద్దు అన్నది. అంతదాకా ఎందుకు పొరుగున ఉన్న తెలంగాణాలోనూ అదే మాట మాట్లాడుతూ మోడీ షాలు హెూరెత్తించారు. మోడీ అయితే మరి కాస్తా ముందుకు వెళ్ళి మతపరమైన రిజర్వేషన్లు కొనసాగనివ్వను అని తెలంగాణా గడ్డ మీదనే భీషణ ప్రకటన చేశారు.అదే మోడీ ఏపీకి వచ్చి రెండు ఎన్నికల సభలలో పాలుపంచుకున్నారు. ఆ రెండు చోట్లా ఆయన ముస్లిం రిజర్వేషన్ల మీద మాట్లాడలేదు సరికదా ఆ ఊసే ఎరగనట్టుగా వ్యవహరించారు. అదే తీరులో దేశ హెూం మంత్రి అమిత్ షా కూడా ఉన్నారు. నిజానికి బీజేపీ ఫిలాసఫీ అది. మతపరమైన రిజర్వేషనలకు బీజేపీ మాతృ సంస్థ ఆరెస్సెస్ అసలు ఒప్పుకోదు..మత పరమైన రిజర్వేషన్లతో దేశంలో చీలిక వస్తుందని ఆరెస్సెస్ గట్టిగా నమ్ముతుంది. అంతలా బీజేపీ జీవ సిద్ధాంతం అయిన ఆ మాటను నిర్భయంగా గట్టిగా ఏపీ గడ్డ మీద ఎందుకు చెప్పలేకపోయారు అన్నదే అందరిలో కలుగుతున్న ధర్మ సందేహం. రామభక్తులు జగన్ కి ఓటు వేయవద్దు అని అమిత్ షా పిలుపు ఇచ్చారు. అదే నోటితో మైనారిటీ బుజ్జగింపులకు మా మద్దతు ఉండదని ఎందుకు చెప్పలేకపోయారు అని ప్రశ్నిస్తున్నారు.ఎన్నికల మ్యానిఫెస్టోతో సంబంధం లేకుండా చంద్రబాబు ఏకంగా ముస్లింలకు భారీ నజరానాలు ప్రకటించారు. లక్ష రూపాయల దాకా ఆర్థిక సాయం హజ్ యాత్రీకులకు ఆయన ప్రకటించారు. అలాగే యాభై ఏళ్ళు నిండితే చాలు పెన్షన్ అని కూడా ప్రకటించారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయకుండా చూస్తామని కూడా ప్రామిస్ చేశారు.మరి ఇవన్నీ మోడీ అమిత్ షాలకు తెలియవా అన్న ప్రశ్నలు వస్తున్నాయి. మైనారిటీలను బుజ్జగిస్తున్నారు అని కాంగ్రెస్ మీద విరుచుకుని పడే మోడీ షాలు ఏపీలో ప్రాంతీయ పార్టీలు రెండూ అదే పనిచేస్తున్నా ఎందుకు ఖండించడం లేదు. ఏపీకి వచ్చి ముస్లిం రిజర్వేషన్లు తాము రద్దు చేస్తున్నామని ఎందుకు ప్రకటించడం లేదు అన్న చర్చ వస్తోంది. రిజర్వేషన్ల కోసం బడుగు వర్గాలు ఆశగా చూస్తున్నాయని దేశమంతా చెబుతున్నారు. ఏపీలో ఎందుకు చెప్పడం లేదు అని కూడా అడుగుతున్నారు.దీనిని బట్టే బీజేపీ ఫిలాసఫీని కూడా పక్కన పెట్టి ఏపీలో ఓట్ల రాజకీయానికి తెర తీస్తోందని అంటున్నారు. టీడీపీకి ఆ కూటమిలో ఉన్న బీజేపీకి కూడా ఓట్లు కావాలని అందుకే కోరి మరీ ఈ ప్రస్తావన చేయలేదని అంటున్నారు.ఇక దీని మీద సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అయితే చంద్రబాబు ద్వంద్వ నీతిని ఎండగట్టారు.బీజేపీ తీరునూ తప్పు పట్టారు. ఏపీలో ముస్లిం రిజర్వేషన్లు రద్దు



చేయకుండా చూస్తాను అని బాబు ఎలా చెబుతారని దేశవ్యాప్తంగా బీజేపీ రద్దు చేస్తే అది ఏపీకి కూడా వర్తించదా అని ఆయన ప్రశ్నించారు. అలాగే బీజేపీ ఏపీలో గమ్మున ఉండడం వెనక మర్మమేమిటి అన్న ప్రశ్నలూ వస్తున్నాయి.కొన్ని దాచి మరి కొన్ని మూసి అన్న చందంగా ఏపీలో బీజేపీ పెద్దల ప్రచారం సాగుతోంది అన్న విమర్శలు వస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ మీద మాట్లాడాల్సిన చోట దాని మీద అసలు మాట్లాడలేదు. ముస్లిం రిజర్వేషన్లు విషయంలో మాత్రం నర్మగర్భంగా మాట్లాడకుండా వ్యవహరించారు అన్న విమర్శలు వస్తున్నాయి. అయినా ముస్లిం సమాజానికి ఇవన్నీ తెలియదు అనుకుంటే పొరపాటే అంటున్నారు. చిత్రమేంటి అంటే దేశమంతా నినదించిన ఒక బలమైన స్లోగన్ ఏపీకి రాగానే ఎందుకు మూగబోయింది అన్నదే.

## పార్లమెంట్ ఎన్నికల్లో 12 నుండి14 సీట్లు గెలుస్తాం

జగిత్యాల, తెలంగాణలో కాంగ్రెస్ హవా ఉందన్నారు చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. పార్లమెంట్ ఎన్నికల్లో 12 నుండి14 సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి తరుపున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ గ్రాఫ్ పడిపోయిందని... బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు ఏమి చేయలేదన్నారు. మోదీ, అమిత్ షా.. అదానీ, అంబానీ లాంటి పెద్ద పెద్ద వ్యాపారవేత్తల కోసమే పనిచేశారని ఆరోపించారు. వారికే లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. పేదవారికి అకౌంట్లో డబ్బులు వేస్తామని చెప్పి వేయలేదని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని చెప్పారు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి. జగిత్యాలలో షుగర్ ఫ్యాక్టరీ ఓపెన్ చేసే అవకాశం ఉన్నా ఓపెన్ చేయలేదన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com